




# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :93 మంగళవారం 24 ఫిబ్రవరి 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari




## మరోమారు భారీగా పెరిగిన

# బంగారం ధరలు

- అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతరామన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం):

దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు..భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్..

మిగతా 2లో...



## నేపాల్లో లోయలో పడ్డ బస్సు

# 18మంది మృతి

ఖాట్మండ్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):

నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ఓ ప్రయాణికుల బస్సు లోయలో పడి 18 మంది మృతిచెందారు. మరో 28 మంది గాయపడ్డారు. పొఖారా నుంచి కాఠ్‌మాండూ వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. బస్సు అదుపుతప్పి త్రిశూలీ నదిలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 45 మందికి పైగా ప్రయాణికులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, అతివేగం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి

# నిర్ణయం..!



- ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం
- మెట్రో విస్తరణకు తొలగనున్న అడ్డంకులు
- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టిటిడి నిర్మాణాలకు 20 ఎకరాలు
- మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం):

హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే పక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవే శ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన పక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది.

మిగతా 2లో...

## ఆ విషయంలో బీఆర్ఎస్ ఫెయిల్ అయింది..

# జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం


- జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత
- భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ
- నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత

2 లో



# సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం

- సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం కృషి
- వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు
- కల్తీపాల మృతుల కుటుంబాలకు పదిలక్షల ఎక్స్‌గ్రేషియా
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటన



అమరావతి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం):

సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో సోమవారం సంక్షేమ బ్జడెట్ కేటాయింపులపై చర్చించారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు.నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు.

మిగతా 2లో...

## రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు


# సిద్ధం కండి

- రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి
- దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం
- డిసిసి అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సిఎం భట్టి

వికారాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం):

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

మిగతా 2లో...



# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

- విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ
- జీఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం
- ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క



హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం):

అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి.

మిగతా 2లో...

# నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు: కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం):



తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సం స్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడు తున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవి ధంగా స్పందించారు. 'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయ త్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాల నుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

# వికసిత బెంగాల్ బాధ్యత నాది

- ఆందోళన కలిగించేలా బెంగాల్లో చొరబాట్లు
- బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం
- బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం):

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగ నున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

మిగతా 2లో...

# మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం..!

మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు గా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ది చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన పక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జన గణన పక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావు ఈ పక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ పక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమ రేటర్లను, వారికి దిశానిర్దేశం చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన పక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ పక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన పక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి

తాజా ధరల వివారల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,724 పెరిగి.. రూ.1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.15,931 పెరిగి రూ.2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు' అని పేర్కొన్నారు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..

# ధ్వజస్తంభం ప్రతిష్ఠపాన కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్

**జగ్గంపేట ప్రజా వీక్షణం కాకినాడ జిల్లా జగ్గంపేట ఫిబ్రవరి 23:**

జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేట మండలం సగరపేట గ్రామం లో రామాలయం దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన ద్వజ స్థంభం నిలబెట్టిన కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఈ కార్యక్రమం లో ఏర్పాటు చేసిన హోమం లో రమేష్ పాల్గొన్నారు.. ఈ కార్యక్రమం లో గాది నాగరాజు, పాండు, మాదారపు వీరబాబు, కాయల మణికంఠ,పాలెం బాబీ, పండు, వంశీ, సగరపేట జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

మొదటిపేజీ తరువాయి

రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు .దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమంలో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ÷ఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరా నితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు.స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరానితనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

మొదటిపేజీ తరువాయి

ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమిలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్టీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం-పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం

మొదటిపేజీ తరువాయి

అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్-3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించిందని సీఎం చెప్పారు. రాజమహేంద్రవరం లోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. లాలాచెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని.. ఎనిమిది మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వరలక్ష్మి డెయిరీకి చెందిన కల్తీ పాల వల్లే పలువురు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. సెక్షన్ 194 కింద బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

# వికసిత బెంగాల్ బాధ్యత నాది

మొదటిపేజీ తరువాయి

బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యవత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ధి చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు.'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. ఇవాళ బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని మోదీ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

# ఆ విషయంలో బీఆర్‌ఎస్ ఫెయిల్ అయింది.. జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం


మొదటిపేజీ తరువాయి

బీఆర్‌ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమ యంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు. కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు.జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు.సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వాలతో పని చేయించడం కోసమే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరు ఏమిచ్చినా తీసుకోవాలని, కానీ పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని, అప్పుడు డబ్బులు ఇచ్చినా తీసుకోవాలని, కానీ మీకోసం కొట్లాడే జాగృతి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ ఇండ్లు శంకుస్థాపన చేయనీకుండా అడ్డుపడుతున్న అటవీశాఖ అధికారులు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 23(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జిల్లా కాగజ్ నగర్ మండలం కొత్త సార్సాల గ్రామ పంచాయతీ ఇందిరమ్మ ఇండ్లు శంకుస్థాపన చేయనీకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డ పడుతున్నారని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కు సార్సాల గ్రామస్థులు అందరూ కలసి వినతి పత్రం అందజేయడం జరిగింది.గత 50 సంవత్సరాల నుంచి అక్కడే నివాసం ఉంటున్న గ్రామస్తులను ఇందిరమ్మ ఇళ్ల ను కట్టకుండా అటవీ అధికారులు అడ్డ గ్రామ పంచాయతీ అబివృద్ధి కి అడ్డ పతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం గ్రామస్థులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## తీరనున్న దిందా గ్రామస్తుల చిరకాల స్వప్నం..

### సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 23(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దింద గ్రామ శివారులో గల వాగుపై రూ.5 కోట్ల అంచనాతో మంజూరైన వంతెన నిర్మాణం సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు చొరవ మేరకు శరవేగంగా సాగుతున్నది బ్రిడ్జి సైట్ ను పరిశీలించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు కాంట్రాక్టర్లకు మరియు అధికారులకు పలు సూచనలు చేయడం జరిగింది. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అప్రోచ్ రోడ్ పై కూడా సీసీ రోడ్డు వేయాలని తెలియజేయడం జరిగింది.ఈ వంతెన నిర్మాణంతో దిందా గ్రామస్తుల చిరకాల స్వప్నం తీరనున్నదని, అలాగే ఆర్ అండ్ బి రోడ్ నుంచి దిందా గ్రామం వరకు బీటీ రెన్యువల్ మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. దిందా గ్రామస్తులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలను ఉన్నతాధికారులు మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



## పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి జిల్లా కలెక్టర్ కె.హరిత..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పండుగలను మత సామరస్యంతో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, శిక్షణ ఐ ఎఫ్ ఎస్ అధికారి భార్గవ్ కుమార్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసమును ప్రజలు శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలిపారు. మసీదుల వద్ద ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్రార్థన సమయాలలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ ఈ ను ఆదేశించారు. మసీదుల వద్ద ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీస్ శాఖ సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో పండుగలను శాంతియుత వాతావరణంలో మతసామరస్యంతో జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, విద్యుత్తు శాఖ ఎస్ ఈ ఉత్తం జాడే, తహసిల్దార్లు రియాజ్, మధుకర్, మున్సిపల్ కమిషనర్ గజానన్, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ అహ్మద్, శాంతి కమిటీ సభ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ చేసే వారిపై

# చట్టపరమైన చర్యలు

## జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 23(ప్రజా వీక్షణం న్యూస్)**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ మరియు మైనర్ డ్రైవింగ్ చేయటం నిషేధమని, మైనర్ వాహనం నడిపి పట్టుబడిన సందర్భాల్లో వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేయబడుతుందని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ హెచ్చరించారు.వాహన యజమానులు మైనర్ వ్యక్తులకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్ వాహనం నడిపినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ ప్రమాదాలు వాహన యజమానితో పాటు ఇతర వ్యక్తులకు కూడా నష్టం కలిగించే అవకాశముందని, కాబట్టి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఎస్పీ సూచించారు.అలాగే, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం, నంబర్ ప్లేట్ దాచడం లేదా తప్పుడు నంబర్లు ఏర్పాటు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా శబ్ద కాలుష్యాన్ని సృష్టించే విధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు వాహనదారులు నంబర్ గుర్తించలేని ఫ్యాన్సీ డిజైన్ లేదా తప్పుడు నంబర్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా అన్ని వాహనాల నంబర్ ప్లేట్లను నిబంధనలకు అనుగుణంగా సరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.అదేవిధంగా, రాంగ్ సైడ్ పార్కింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, బాధ్యతారాహిత్యంగా ఓవర్ లోడెడ్ వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తెలిపారు.వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు మరియు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలి, ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రజ భద్రత కొరకు జిల్లా వ్యాప్తంగా నిరంతర తనిఖీలు చేపడతామని తెలిపారు.

## 5 లక్షలు రూపాయలు నిధులు మంజూరు

**గండేపల్లి పల్లి ప్రజా వీక్షణం కాకినాడ జిల్లా గండేపల్లి ఫిబ్రవరి 23:**

మండల కేంద్రమైన గండేపల్లి గ్రామంలో మంచినీటి చెరువు వద్ద గల ఆర్ అండ్ బి రోడ్డు సమీపంలో గల స్మశానవాటిక వద్ద వర్షాకాలం అక్కడ నీరు వెళ్లకుండా ఆ దారిని వెళ్లే ప్రయాణికులు, జిల్లా పరిషత్ హైస్కూల్ కు వెళ్లే పిల్లలు, ఎండిఓ ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్, పోలీస్ స్టేషన్కు పనిమీద వెళుతున్న ప్రజలు, అలాగే వే బ్రిడ్జి కు వెళుతున్న వాహనదారులు పడుతున్న ఇబ్బందులు గురించి స్థానిక ఎమ్మెల్యే జగ్గంపేట శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ వారికి విషయాన్ని గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ తదితరులు తెలియజేయగా వారు తక్షణం స్పందించి ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ డి ఈ ఈ రాఘవరావు వారికి తెలియజేయగా వారు జేఈ సాయికిరణ్ ను పంపించి 5 లక్షల రూపాయలు నిధులను మంజూరు చేయించినారు. ఈరోజు ఆర్ అండ్ బి వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ వచ్చి వర్క్ తాలూకా వివరాలను తెలియజేశారు. గండేపల్లి గ్రామ ప్రజలు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వారికి అలాగే ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ వారికి ధన్యవాదాలు తెలియజేసినారు.



# రైతు భరోసా ఏదీ?..

## అన్నదాతల ఉసురు పోసుకుంటున్న రేవంత్ సర్కార్

### రుణమాఫీ పేరుతో 'సాంకేతిక' నాటకాలు.. తక్షణమే బకాయిలు చెల్లించాలి ఎరువుల కొరత సృష్టిస్తే సహించేది లేదు

### జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ప్రజా వీక్షణం న్యూస్,/ ఖమ్మం**

ఖమ్మం జిల్లా రైతాంగం అష్టకష్టాలు పడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదా? అని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ప్రశ్నించారు. అన్నదాతల కన్నీళ్లు చూస్తూ యంత్రాంగం నిద్రపోతోందా? అని ఆయన మండిపడ్డారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీనారాయణ పిలుపు మేరకు సోమవారం కిసాన్ మోర్చా నాయకులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. "ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇవ్వాల్సిన రైతు భరోసా ఏమైంది? వెంటనే అన్నదాతల ఖాతాల్లో ఆ డబ్బులు ఎందుకు జమ చేయడం లేదు?" అని నిలదీశారు. సర్వర్లు, సాంకేతిక లోపాల పేర్లతో రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బూటకపు సాకులు పక్కనపెట్టి, అర్హులైన రైతులందరికీ తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



లేనిపక్షంలో రైతుల ఆగ్రహ జ్వాలలకు ప్రభుత్వం భస్మం కాకతప్పదని హెచ్చరించారు.యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తుంటే పాలకులకు కనిపించడం లేదా? అని ఆయన ప్రశ్నించారు. ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ధాన్యం బోనస్ బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని తేల్చి చెప్పారు. రాబోయే యాసంగి సీజన్ లో వరి ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.నాగార్జున సాగర్ ఆయకట్టు కింద పండిన పంటలు ఎండిపోకుండా, చివరి దశ వరకు నిరంతరాయంగా సాగునీరు అందించాలని కోరారు. అలాగే, పత్తి కొనుగోలు గడువును పెంచి మద్దతు ధరతో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ , బీజేపీ నాయకులు మదడపుసుబ్బారావు,వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పసిబిడ్డను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

### జి.రవికుమార్ టిఆర్పి పార్టీ యూత్ అధ్యక్షులు వనపర్తి జిల్లా

**ప్రజా వీక్షణం. ఫిబ్రవరి 23. వనపర్తి జిల్లా ప్రతినిది.**

పొగరెక్కిన క్రూరత్వంతో నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో దేవుని గుడిలోకి వెళ్లిన బీసీ రజక సోదరులపై తీవ్రంగా కొట్టడం,2 నెలల చిన్నారి పసికందును 8 మంది రెడ్ల కాళ్లతో తన్నడంతో మరణించిందని వనపర్తి జిల్లా టి ఆర్ పి పార్టీ యూత్ అధ్యక్షుడు జి.రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా జి.రవికుమార్ మాట్లాడుతూ, ఈ లోకం చూడని,అభం శుభం ఎరగని విషాదకరం, మనసును కలిచివేసే దుర్మార్గం సంఘటన.నేరస్తులైన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశంమేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు జి.రవికుమార్ ఆధ్వర్యంలో చిన్నారి పసికందు ఆత్మశాంతి కి కొవ్వొత్తుల నిరసనతో డిమాండ్ ఈ కార్యక్రమంలో టిఆర్పిజి జిల్లా యూత్ అధ్యక్షులు రవికుమార్, సిపిఎం మండల కార్యదర్శి వెంకట్ రాములు, చిరంజీవి,టిఆర్ఎస్ నాయకులు బాలకృష్ణ, బిజెపి నాయకులు కురుమన్న, బురాన్, శీను మరియు రజక కులస్తులు శేఖరు, శ్రీకాంత్, కొండన్న, మన్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

### సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం

### మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి

### అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల

**వాషింగ్టన్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం–1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ ప్రక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్ది దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూ?ట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4–10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

జమ్మూకశ్మీర్ లోని కిస్ట్‌వార్ జిల్లా లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

# మాజీ రైల్వేమంత్రి ముకుల్ రాయ్ మృతి

**కోల్‌కతా,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

మాజీ రైల్వే మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు ముకుల్ రాయ్ మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటలకు కోల్‌కతాలోని సాల్ట్ లేక్ అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. రాయ్ మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నారు. అనేక అనారోగ్యాలతో బాధపడుతున్న రాయ్ కొన్ని రోజుల క్రితం కోమాలో ఉన్నారు. మృతదేహాన్ని ఆయన నివాసానికి తీసుకెళ్లి, అంత్యక్రియలు నిర్వహించారు. గత రెండు సంవత్సరాలుగా ముకుల్ రాయ్ ఆసుపత్రిలో, ఆయన నివాసంలో చికిత్స పొందుతున్నారు. తెలిసిన ముఖాలను కూడా ఆయన గుర్తించే సామర్థ్యాన్ని కోల్పోయారు. ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సన్నిహితుడు. ఆయన 2017లో బిజెపిలో చేరారు. ముకుల్ రాజీనామా తర్వాత, తృణమూల్ నుండి అనేక ఫిరాయింపులు జరిగాయి.

# తిరుమలలో భక్తురాలుకి పాము కాటు ప్రచారం

### అదంతా ఉత్తిదే అని తేల్చిన టిటిడి విభాగం

**తిరుమల,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తురాలిని పాము కాటు వేయలేదని టీటీడీ ప్రకటించింది. ఆ ప్రచారమంతా అవాస్తమని తెలిపింది. సోమవారం ఈ వ్యవహారంపై టీటీడీ వివరణ ఇచ్చింది. తెలంగాణలోని భూపాలపల్లికి చెందిన భక్తురాలు మౌనిక పాదాలకు ఆర్బీ సెంటర్ వద్ద స్పర్శ తగలగానే భయభ్రాంతులకు గురైందని చెప్పింది. ఈ విషయాన్ని పక్కనే ఉన్న తన భర్తకు ఆమె తెలియజేశారంది. దీంతో ఆ ప్రాంతాన్ని అతను పరిశీలించగా.. ఓ చిన్నపాము కనిపించిందని టీటీడీ పేర్కొంది. ఆమెను వెంటనే స్థానిక అశ్వినీ ఆసుపత్రికి తరలించారని చెప్పింది. మౌనిక పాదాలను పరిశీలించిన వైద్యులు.. పాము కాటు వేయలేదని చెప్పారంది. అంతేకానీ క్యూ లైన్‌లో మాత్రం పాము కనిపించలేదని టీటీడీ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. మరోవైపు మౌనికకు పాము కాటు వేయలేదని ఆమె భర్త శరత్ బాబు వెల్లడించారు. పాము కాటుకు సంబంధించిన వివరణను ఆయన ఇచ్చారు. స్వామివారి దర్శనార్థం క్యూ లైన్‌లోకి వెళ్లేందుకు మ్యూజియం వద్దకు తాము వచ్చామన్నారు. ఆ సమయంలో పసుపు రాసుకునేందుకు మౌనిక పక్కకు వెళ్లిందని చెప్పారు. పాదాలకు ఏదో పాకినట్లుగా ఉందని చెబితే.. పరిశీలించామన్నారు. చిన్న పాములా ఉందని గుర్తించామని తెలిపారు. చికిత్స కోసం అశ్వినీ ఆసుపత్రికి వెళ్లామన్నారు. అక్కడ ప్రాథమిక చికిత్స తీసుకున్న తర్వాత.. మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారని పేర్కొన్నారు. అక్కడ వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వహించారని చెప్పారు. అనంతరం పాము కాటు వేయలేదని వైద్యులు తెలిపారన్నారు. మౌనిక పూర్తి ఆరోగ్యంగా ఉండడంతో స్విమ్స్ నుంచి మౌనికను వైద్యులు డిశ్చార్జ్ చేశారని ఆమె భర్త శరత్ బాబు తెలిపారు. అయితే భక్తురాలు పాముకాటుకు గురైందని ప్రచారం సాగింది. తిరుమల క్యూలైన్‌లో ఓ భక్తురాలు పాముకాటుకు గురైనట్లు జరుగుతున్న ప్రచారాన్ని తితిదే ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు వాస్తవంగా అక్కడేం జరిగిందో వివరిస్తూ ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం సైతం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. తిరుమల క్యూలైన్‌లో భక్తురాలు పాముకాటుకు గురైనట్లు కొందరు చేస్తున్న ప్రచారంలో నిజం లేదు. వాస్తవానికి జరిగింది ఏమిటంటే.. వరంగల్‌కు చెందిన శరత్ బాబు, మౌనిక దంపతులు ఆదివారం రాత్రి స్వామి దర్శనం కోసం టాక్సీలో ఎస్వీ మ్యూజియం వద్దకు వచ్చారు. ఆర్.బి.సెంటర్ పార్కింగ్ ఏరియా వద్దకు రాగానే తన కాలికి పసుపు రాసుకునే ఉద్దేశంతో మౌనిక కారు నుంచి కిందకు దిగారు. ఆ సమయంలో తన కాలికి ఏదో తాకడంతో ఆమె భయంతో గట్టిగా అరిచారు. వెంటనే ఆమె భర్త శరత్ బాబు వెతికి చూడగా అక్కడ ఒక పాము పిల్ల కనిపించింది. దీంతో అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది మౌనికను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. భక్తురాలిని పరీక్షించిన వైద్యులు ఆమె పాముకాటుకు గురికాలేదని నిర్ధారించారు. అయినప్పటికీ ఆమె శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తగా తిరుపతిలోని స్విమ్స్‌లో చేర్చారు. స్విమ్స్ వైద్యులు సైతం ఆమె పాము కాటుకు గురికాలేదని చెప్పారు. అలాగే, అక్కడ కనిపించిన పాము కూడా విషపూరితం కాదని తేలింది. ఈ ఘటన జరిగిన వెంటనే తితిదే సిబ్బంది స్పందించిన తీరుకు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉదయం ఆ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. జరిగింది ఇదీ. అందువల్ల కొందరు చేస్తున్న ఫేక్ ప్రచారాలను భక్తులు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

### ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత

### కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటు చేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలు వరించింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

# కల్తీపాల ఘటనలో 12మందికి చికిత్స

### వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది-వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్

**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

కల్తీ పాల ఘటనలో ఆస్పత్రుల్లో 12 మంది ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్ తెలిపారు. ఈ ఘటనలో నిందితుడిగా ఉన్న పాల వ్యాపారి 126 కుటుంబాలకు పాలు పోసినట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ కిడ్నీ బాధిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీతో కలిసి వీరపాండ్యన్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు కూడా వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాధితుల వైద్య ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఇప్పటి వరకు నలుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో పలువురు వివిధ ఆస్పత్రుల్లో చేరారు.

# జంటజలాశయాల్లో కాలుష్యంపై విచారణ

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల కాలుష్యంపై హైకోర్టులో విచారణ జరిగింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. జలాశయాల్లో మురుగు, పరిశ్రమల వ్యర్థాలు చేరి.. నీళ్లు కలుషితమవుతున్నాయంటూ వార్తాపత్రికలో వచ్చిన కథనాన్ని సుమోటోగా తీసుకున్న సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. తాగునీటి జలాశయాల్లో వ్యర్థాలు చేరడంపై ఉన్నత న్యాయస్థానం జలమండలిని ప్రశ్నించింది. జలమండలి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీని ప్రతివాదులుగా చేర్చింది. జంట జలాశయాల నిర్వహణపై 4 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

# హౌజింగ్ బోర్డు భూములకు రెక్కలు

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హౌసింగ్ బోర్డు భూములు అధిక ధరలు పలికాయి. గచ్చిబౌలి, భౌరంపేట్, బాలాజీ నగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని మొత్తం 14 స్థలాలను బహిరంగ వేలం వేశారు. వీటిలో గచ్చిబౌలిలోని భూమి చదరపు గజం రూ.1.76 లక్షలు, కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలు పలికింది. బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.34.27 కోట్ల ఆదాయం సమకూరింది. కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ వేలంలో 50 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో ఆగని దారుణాలు

### హిందూ దివ్యాంగురాలుపై సామూహిక అత్యాచారం

**ఢాకా,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, అకృత్యాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్‌పుర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతంలో స్పృహ కోల్పోయి ఉన్న మహిళను గుర్తించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. వారు తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది.ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయాలకు స్వామిని వాడుకుంటారా?

### మండిపడ్డ కర్నూలు ఎంపి శబరి

**కర్నూలు,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

వైకాపా నాయకులు వేంకటేశ్వరస్వామిని రాజకీయాలకు వాడుకుంటు న్నారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. స్వామిని అప్రతిష్టపాలు చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా కల్తీ నెయ్యి విషయంలో ఇప్పటికైనా వైకాపా నిజాలు వెల్లడించాలని అన్నారు.కర్నూలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. వైకాపా హయాంలో తిరుమలలో అన్యమత ప్రచారం జరిగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గతంలో భూమన కరుణాకర్ రెడ్డి ఏడు కొండల గురించి ఏ విధంగా మాట్లాడారో శబరి గుర్తుచేశారు. వైకాపా నాయకులు ఎక్కడికి వెళ్లినా వేంకటేశ్వరస్వామి గుర్తుకు వచ్చే రోజులు వస్తాయని ఎంపీ అన్నారు. దేవదేవుడికి అపచారం చేసిన వారికి శిక్ష తప్పదన్నారు.

# అసంఘటిత కార్మికులకు మేలు చేయాలి: ఎమ్మెల్యే పార్థసారథి

**అమరావతి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

ఏపీలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆదోని నియోజకవర్గం భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. కోవిడ్ బాధితులకు సహాయం కోసం ఈశ్రమ్ పోర్టల్‌ను అమల్లోకి తీసుకొస్తే, గత వైకాపా ప్రభుత్వంలో చాలా తక్కువ మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే 18 లక్షల మంది కార్మికులు పేర్లు నమోదు చేసుకోవడం హర్షించదగిన విషయమన్నారు. గత వైకాపా పాలనలో విశ్వకర్మ యోజన జీవనజ్యోతి అటల్ పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు సైతం కార్మికులకు అందలేదన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద కేంద్రం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.25 లక్షలు వైద్య సేవలు, ఎక్కడైనా రేషన్ తీసుకునే అంశంపై మంత్రి స్పందించాలని కోరారు.

# వందవరోజుకు చేరిన ఆదోని జిల్లా ఆందోళన

**ఆదోని,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదోని పట్టణంలో ఐక్య ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నారు. ఈ దీక్షలు సోమవారం 100వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఐక్య ఆధ్వర్యంలో నాయకులు ప్రజాసంఘాలు వివిధ పార్టీల నాయకులు ప్రజలు కలిసి కుంబాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం 100 మంది సీపీఐ నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆదోని జిల్లా సాధించేంతవరకు ఈ ఉద్యమం ఆగదని నాయకులు పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన ఆలోచన చేసిన ప్రభుత్వం ఆదోనిని విస్మరించిందని మండిపడ్డారు.

# జిల్లా జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

## మాజీమంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్‌ల భేటీ

## బెయిల్ పిటిషన్‌పై వాదనలు నేటికి వాయిదా

**ఆదిలాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని, జైలులో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం జైలు బయట వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 14 మంది గెలిచినా మంత్రి వివేక్ అధికార దౌర్జన్యంతో ఎన్నికలను నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసి బీఆర్ఎస్ నాయకులపైనే కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. సుమన్ పై ఉన్న పాత కేసులు తోడి బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకుంటామని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. జైలులో అధికారులు సుమన్‌ను మానసిక శోభకు గురి చేస్తున్నారని, దోమలు బాగా ఉన్న పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తెలిపారు. కొంత అనారోగ్యానికి గురైన వైద్యం అందించడం లేదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఇదిలావుంటే రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్ పిటిషన్ పై వాదనలను కోర్టు నేటికి వాయిదా వేసింది. జిల్లా జైలులో ఉన్న బాల్కసుమన్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణకు రాగా కోర్టు పరిశీలించింది.కౌంటర్ పిటిషన్ పై గడువు కావాలని పోలీసులు కోరగా బెయిలు పిటిషన్ పై వాదనలను రేపటికి వాయిదా వేసింది. జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించింది. పోలీసులను, ప్రభుత్వాన్ని నిలదీసిన బాల్కసుమన్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది . గత వారం రోజులకు పైగా సుమన్ మంచిర్యాల జిల్లా జైలులో ఉన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు బంద్ నిర్వహించాయి .

# రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

## మున్సిపల్ ఎన్నికలల్లో డ్రామా నడిపించారు

## డ్రామాలతో కాలం గడుపుతున్న సిఎం రేవంత్

## మండిపడ్డ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు మొత్తాన్ని ఒక డ్రామా నడిపించారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క రోజూ మున్సిపాలిటీల అభివృద్ధి గురించి చెప్పలేదని సంజయ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న వ్యక్తిగా, ఒక డాక్టర్‌గా, రాజ్యాంగాన్ని నమ్ముకున్న వ్యక్తిగా అన్ని వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ముందు మా నాయకుడు హరీశ్‌రావు సిట్ పేరుతో నోటీసులు ఇచ్చి మొదటి డ్రామాకు తెరలేపారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమైనా ఉందా అంటే మన్ను లేదు మశానం లేదని అన్నారు. దావోస్ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విహార యాత్రకు చేశాడని.. మొత్తం 12 రోజుల పాటు వెళ్లిన ముఖ్యమంత్రి , దావోసు నుండి తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు గురించి చెప్పలేదని పేర్కొన్నారు. పెట్టుబడులపై మంత్రి శ్రీధర్ బాబు అయినా మాట్లాడతాడని అనుకుంటే ఆయన కూడా మాట్లాడలేదని చెప్పారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనను విహార యాత్ర అంటున్నామని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తెలంగాణ జాతిపిత అయిన కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులిచ్చి రెండో డ్రామాకు తెరలేపారని సంజయ్ మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చడంలో రేవంత్ రెడ్డి ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉన్నప్పుడు మున్సిపాలిటీల్లో సభలు నిర్వహిస్తాడని.. మున్సిపల్ ఎన్నికలు ఉన్నప్పుడు గ్రామ పంచాయతీలో సభలు నిర్వహిస్తాడని చెప్పారు. ఏదో ఒక రకంగా ప్రజలను రేవంత్ రెడ్డి మభ్య పెడుతున్నాడని మండి పడ్డారు. ఇతర పార్టీలతో అంటకాగేది రేవంత్ రెడ్డి అని.. కానీ బీఆర్ఎస్‌కు బీజేపీకి లింక్ పెడుతున్నారని విమర్శించారు. వీణా వాణి గురించి నీచంగా మాట్లాడిన వ్యక్తి రేవంత్ రెడ్డి అంటూ ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రానికి ముమ్మాటికి జాతిపిత కేసీఆరే అని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని.. తగిన సమయంలో రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమని సంజయ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసే వరకు కేసీఆర్ ను తిట్టడం తప్పా, అభివృద్ధి గురించి మాట్లాడడం లేదని తెలిపారు. తప్పులు చేస్తే చెప్పండి అని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, ప్రతిరోజు తప్పులు చేస్తూనే ఉన్నాడని పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి సమస్యలపై మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో నిజాయితీగా ప్రజల సమస్యల పై చర్చ చేయాలన్నారు. ఈ బడ్జెట్ లో మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇస్తామని చెప్పిన హామీలకు నిధులు కేటాయించకపోతే వారందరూ కలిసి కాంగ్రెస్‌కుబుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో రేవంత్ రెడ్డికి ఫేవరేట్ సబ్జెక్ట్ అయిన రియల్ ఎస్టేట్ గురించి మాట్లాడుదామని తెలిపారు. సమావేశాలకు వచ్చే ముందు దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలుసుంటే బావుంటుందని రేవంత్ రెడ్డిపై సెటైర్లు వేశారు. ఎట్టకేలకు దేవాదుల ప్రాజెక్టు దగ్గరకు వెళ్లినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు శ్రీరామ రక్ష అని రేవంత్ రెడ్డికి తెలుసు అని సంజయ్ అన్నారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయాల్సిందేనని తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో మాకు మైక్ ఇవ్వమని చెప్పండి, జలాల పై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజిని లాంటి వాడు, ఆయన చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని విమర్శించారు. ఈసారి అయిన అసెంబ్లీని గౌరవించి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని సూచించారు. పార్టీ మారారని ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్‌పై అనర్హత వేటు వేశారని సంజయ్ తెలిపారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా స్పీకర్ వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ కు మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రచారం చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు.

# కామారెడ్డిలో తగని ఉద్రిక్తత

## ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత

## పరీక్షించిన వైద్యులు..రెస్ట్ తీసుకోవాలని సూచన

**కామారెడ్డి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

ఓవైపు కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతున్న వేళ,కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి లో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్భంధంలో ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించి జరుగుతున్న గొడవ.. సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆరోగ్యంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. అయితే మరికొన్ని రోజుల పాటు ఆయనకు విశ్రాంతి అవసరమని సూచించారు. ఇదిలావుంటే కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య సవాళ్ల నేపథ్యంలో స్థానికంగా హైటెన్షన్ వాతావారణం నెలకొంది. సోమవారం జిల్లా కలెక్టర్‌తో బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి భేటీ కావాలనున్నారు. తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో అందుకు సంబంధించిన సాక్ష్యాలు తీసుకురావాలంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మరోవైపు డిగ్రీ కాలేజీ భూముల విషయంలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వెంకట రమణారెడ్డి ప్రకటించిన విషయం విదితమే. రాజీనామాకు సిద్ధం కావాలంటూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములపై స్పష్టత ఇవ్వాలంటూ అధికారులను బీజేపీ డిమాండ్ చేసింది. ఇలా ఇరు పార్టీనేతల విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతో కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేపథ్యంలో పోలీసులు వెంటనే అలర్ట్ అయ్యారు. ఇరు పార్టీల నేతలను కలెక్టర్ కార్యాలయానికి పోలీసులు వెళ్లనిస్తారా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతుగా కామారెడ్డి వెళ్లేందుకు యత్నించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కామారెడ్డి వెళ్తుండగా.. ఆయన్నూ పెద్దశంకరపేట వద్ద అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే.

# 3లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సిఐ,ఎస్ఐ

**కడప,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

వైఎస్సార్ కడప జిల్లాలోని సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ జరిపిన దాడుల్లో సీఐ కేవీ రమణ, ఎస్ఐ అనిల్‌లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక కేసు విషయంలో బాధితుడిని నుంచి రూ. 3 లక్షల లంచం డిమాండ్ చేయడంతో అతను ఏసీబీకి సమాచారం ఇచ్చాడు. దాంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో సీఐ, ఎస్ఐలను పట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికాలు దాడులు చేశారు. పులివెందుల రూరల్ సీఐ, సింహాద్రిపురం ఎస్ఐలను ఈ దాడుల్లో ఏసీబీకి దొరికేశారు. పులివెందులలో అత్యంత వివాదాస్పద సీఐగా కేవీ రమణకు పేరుంది. తాజాగా పోలీస్ స్టేషన్‌లోనే లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం కేవీ రమణను మరింత ఇరకాటంలోకి నెట్టింది.

# జాతరలో అమానుష ఘటన

## చర్యలు తీసుకోవాలని డిజిపికి ఫిర్యాదు

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

కుమ్మేరా జాతరలో అమానుష ఘటనపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలోకి వెళ్లి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అగ్రకులానికి చెందిన నాయకుడు రజక కులానికి చెందిన రెండు నెలల పసికందును తన్ని చంపిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు వెలికితీయాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, ఉపేందర్ చారి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు యాదవ్, నేతలు స్వామి యాదవ్ ,రాజు తదితరులున్నారు.

# కలుషిత ఆహారం పెట్టారంటూ విద్యార్థుల ఆందోళన

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

రాష్ట్రంలో ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలల పరిస్థితితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. నాణ్యత లేని, కలుషిత ఆహారం పెడుతున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచుగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలతో వందలాది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై దవాఖానల పాలవుతున్నారు. ఇటీవలే నాగర్‌కర్నూల్ సంఘటన మరవకముందే జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడురు గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. కలుషిత ఆహారం పెడుతున్నారని ఆరోపిస్తూ తరగతులు బహిష్కరించి రోడ్డెక్కారు. మంచి ఆహారం పెట్టి, కనీస వసతులు కల్పించాలని, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు.

# వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

## సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం

## టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు వాట్సాప్ చాట్‌బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమోదుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్‌లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

# కేజీబీవీ బెడ్స్ టెండర్లలో రూ.100 కోట్ల కుంభకోణం

## లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

కేజీబీవీ బంకర్ బెడ్స్ టెండర్లలో జరిగిన రూ.100 కోట్ల కుంభకోణంపై వెంటనే సీబీఐ విచారణ జరపాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభకోణం విషయంలో ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం లో చలనం లేదని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవినీతి అడ్డుకట్టలేకుండా కొనసాగుతోందని విమర్శించారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ విద్యార్థులు చదువుకునే కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక వసతుల పేరుతో ఈ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని పేర్కొన్నారు .నాసిరకం బంకర్ బెడ్స్ సరఫరా చేసి టెండర్లలో నియమ నిబంధనలను ఉల్లంఘించి ట్రూఫా , ముఫత్లాన్ కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ. 12 వేల ఒక బెడ్డును లోకల్ ఎంఎస్ఎంఈలకు లకు లబ్ది చేకూర్చాలనే ఉద్దేశంతో టెండర్‌లో భాగస్వామ్యం చేసారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అదే బెడ్డును రూ. 35 వేలకు మధ్యప్రదేశ్ నుంచి కొనుగోలు చేస్తూ ఒక్కో బొడ్డుపై 22 వేల రూపాయలను ఎస్టిమేషన్ కాస్ట్ పెంచి కాంట్రాక్టర్‌కు లబ్ది చేకూర్చారని ఆరోపించారు. మొత్తం 45,360 బెడ్‌లకు గాను ఒక్కో బెడ్డుకు రూ. 33,446 అందజేస్తున్నాని, దాదాపుగా రూ. 164 కోట్ల రూపాయలను ఢిల్లీలో రాహుల్ గాంధీకి చేరవేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కుంభకోణంపై వెంటనే సీబీఐతో న్యాయ విచారణ జరపాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

# తెలంగాణ టిజి ఎడ్‌సెట్ నోటిఫఙకేషన్ విడుదల

## 23నుంచి ఎప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం

## మే 12న తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

తెలంగాణ రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రతిష్టాత్మక టిజి ఎడ్‌సెట్-2026 నోటిఫికేషన్‌ను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్ష నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన కేయూ, దరఖాస్తుల పక్రియ నుంచి ఫలితాల విడుదల వరకు పూర్తి షెడ్యూల్‌ను ఖరారు చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 23వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. గడువు ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల సౌకర్యార్థం అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును అధికారులు కల్పించారు. రూ. 250 ఫైన్‌తో ఏప్రిల్ 23 వరకు, రూ. 500 ఫైన్‌తో ఏప్రిల్ 27 వరకు , రూ. 1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతించనున్నారు. ఇక పరీక్షా నిర్వహణ విషయానికి వస్తే, మే 12వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి ఉదయం , సాయంత్రం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పూర్తయిన మూడు రోజుల్లోనే అంటే మే 15న అధికారులు ప్రాథమిక కీని విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించిన అనంతరం, మే 30వ తేదీన తుది ఫలితాలను వెల్లడించనున్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

## పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం

## హైదరాబాద్‌లో పలుచోట్ల మోస్తరు వర్షం

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భాగ్యనగరంలో పలుచోట్ల వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపం చూపినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మబ్బుపట్టి చల్లని గాలులు వీచడంతో నగరంలో ఆహ్లాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా రోజుల తర్వాత కురిసిన చిరు జల్లులు భాగ్యనగరాన్ని మురిపించాయి. ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్న తరుణంలో హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు పలకరించాడు. నగరంలో ఆకాశం మేఘావృతం కాగా.. ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, కాచిగూడ సహా పలుచోట్ల చిరు జల్లులు కురుస్తున్నాయి. మరోవైపు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్లే వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా అబిడ్స్, బషీర్ బాగ్, సైఫాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అలాగే మీర్ పేట్, బడంగ్ పేట్ ప్రాంతాల్లోనూ వాన పడింది. ఎల్బీ నగర్, మలక్ పేట్, సరూర్ నగర్, చార్మినార్, బీఎన్ రెడ్డి, ఉప్పల్, నాగోల్, అంబర్ పేట్, వనస్థలిపురం, హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో ఈదురు గాలులు బలంగా వీచాయి. వికారాబాద్ ప్రాంతంలో వీస్తున్న భారీ ఈదురు గాలులు ప్రస్తుతం హైదరాబాద్ దిశగా వేగంగా కదులుతున్నాయి. ఈ ప్రభావంతో సాయంత్రం 6 గంటల తర్వాత గచ్చిబౌలి, రాజేంద్ర నగర్, లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో బలమైన గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. నగరంలో వాతావరణం చల్లబడితే, జిల్లాల్లో మాత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాకలో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన (రాళ్ల వర్షం) కురిసింది. భారీ గాలుల కారణంగా షాపుల బోర్డులు, ఫ్లెక్సీలు ఎగిరిపోయాయి. కొన్ని రేకుల ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# సరోగసి అక్రమాలపై విచారణ

## - ఇడి కస్టడీకి డాక్టర్ నమ్రత

## - కోర్టు ఆదేశాలతో విచారణకు సిద్ధం

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

సృష్టి సరోగసీ అక్రమాల కేసులో అరెస్టైన డాక్టర్ నమ్రతపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో మరింత వేగం పెరిగింది. ఈ కేసులో డాక్టర్ నమ్రతను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం రెండు రోజుల పాటు ఈడీ కస్టడీలో విచారణ జరగనుంది. ఈ కేసు సరోగసీ పేరుతో అక్రమాలు, హవాలా, మనీలాండరింగ్ ఆరోపణలతో సంబంధం ఉండటంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డాక్టర్ నమ్రతను ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోర్టును కోరింది. అయితే కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. రెండు రోజుల పాటు మాత్రమే కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ఈడీ అధికారులు డాక్టర్ నమ్రతను తమ కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో కేసుకు సంబంధించిన కీలక అంశాలను వెలికితీసే ప్రయత్నం చేయనున్నారు. డాక్టర్ నమ్రతపై సరోగసీ సేవల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. చట్టబద్ధమైన విధానాలను పాటించకుండా, అక్రమంగా సరోగసీ వ్యవస్థను ఉపయోగించి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలు కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఈ కేసులో ముఖ్యంగా హవాలా, మనీలాండరింగ్ అంశాలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. డాక్టర్ నమ్రత భారీ మొత్తంలో డబ్బు సేకరించి, హవాలా మార్గం ద్వారా విదేశాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డబ్బు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై ఈడీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టనున్నారు. ఈడీ కస్టడీ విచారణలో.. అక్రమంగా సేకరించిన డబ్బు తరలింపు మార్గాలు, ఇందులో పాల్గొన్న ఇతర వ్యక్తులు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై కీలక సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కేసులో మరికొందరు వ్యక్తులు కూడా ఉన్నారా అన్న దానిపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సరోగసీ వ్యవస్థను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. ఈ కేసు ద్వారా అక్రమంగా జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# సునీల్ నాయక్ అరెస్ట్‌ను తప్పుపట్టిన పాట్నా కోర్టు

**పాట్నా,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

బిహార్‌లో పని చేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని పాట్నా కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఎలాంటి ఎఫ్ఐఆర్, కేస్ డైరీ లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు రక్షణ ఉన్నప్పటికీ సునీల్ నాయక్‌ను బలవంతంగా అరెస్ట్ చేయడాన్ని నిలదీసింది. పాట్నా హైకోర్టు చెప్పినప్పటికీ ఏపీ పోలీసులు రావడమేంటని ప్రశ్నించింది. 30 రోజుల వరకూ సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా రఘురామకృష్ణరాజు కేసు విషయానికి సంబంధించి సునీల్ నాయక్‌ను ట్రాన్సిట్ రిమాండ్‌ను పాట్నా సివిల్ కోర్టు తిరస్కరించింది. బలవంతపు అరెస్టును బిహార్ లాయర్లు తీవ్రంగా ఖండించారు. ఏపీ పోలీసులు గోడదూకి మరీ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బిహార్ పోలీసులు సైతం.. ఏపీ పోలీసుల తీరును తప్పుబట్టారు. సునీల్ నాయక్ గతంలో ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటేషన్‌లో పని చేశారు. ఈ క్రమంలోనే రఘురామకృష్ణరాజు కేసు విషయంలో ఆరోపణలు వచ్చాయి. అయితే తాజాగా సునీల్ నాయక్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ సీఐడీ పోలీసులు.. సునీల్ నాయక్ నివాసానికి వెళ్లి అరెస్ట్ చేశారు. దీన్ని బిహార్ డీజీపీ కూడా తీవ్రంగా ఖండించారు. గోడదూకి వచ్చి తమ అధికారిని ఎలా అరెస్ట్ చేస్తారంటూ ప్రశ్నించారు.

# మలుపు తిరిగిన కన్నడ రాజకీయాలు

## మంత్రి పదవులు కోరుతూ

## 31 మంది లేఖ

**బెంగళూరు,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

కర్ణాటకలో నాయకత్వ మార్పు కోసం జరుగుతున్న పోరు మరో మలుపు తిరిగింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో తమకు చోటు కల్పించాలని కోరుతూ తొలిసారి గెలిచిన 31 మందికి పైగా ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానానికి సోమవారంనాడు లేఖ రాశారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఉద్దేశించి ఎమ్మెల్యేలు ఈ లేఖ రాశారు. కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి 38 మంది కొత్త వారిని ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి పంపిన విషయం మీకు తెలుసు. తద్వారా అసెంబ్లీలో కొత్త వారిని చూడాలని అనుకుంటున్నట్టు ప్రజలు స్పష్టమైన సందేశాన్నిచ్చారని అధిష్టానానికి రాసిన లేఖలో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అయితే మంత్రివర్గంలో 34 మందికి చోటు కల్పించినప్పటికీ కొత్తగా ఎన్నికైన ఒక్క ఎమ్మెల్యేకు కూడా అవకాశం కల్పించలేదని అన్నారు. ఆ దృష్ట్యా తొలిసారి ఎన్నికైన సమర్ధత కలిగిన యువ ఎమ్మెల్యేలకు మంత్రులుగా సేవ చేసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానానికి రాసిన లేఖపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలలో ఏఎస్ పొన్నన్న, అశోక్ రాయ్, శ్రీనివాస్ ఎన్‌టీ, పి.రవికుమార్, ఏసీ శ్రీనివాస్, హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్, బి.దేవేంద్ర, నారా భరత్ రెడ్డి, విశ్వాస్ వి వైద్య, బసవరాజ్ వి శివగంగ తదితరులు ఉన్నారు.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

## పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం - పంటలకు తీవ్రంగా నష్టంతో రైతుల ఆందోళన

**హైదరాబాద్,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతుండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.

# ఇండియా కూటమి నేతగా రాహుల్ తప్పుకోవాలి

- నాయకత్వాన్నా ప్రాంతీయ పార్టీలకు అప్పగించాలి
- కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

కాంగ్రెస్ వెటరన్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి సొంత పార్టీపై విమర్శల దాడి చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. 'ఇండియా' కూటమి సారధ్య బాధ్యతల నుంచి రాహుల్‌గాంధీ తప్పుకోవాలని, ఆ బాధ్యతలను ప్రాంతీయ పార్టీల నేతలకు అప్పగించాలని కోల్‌కతాలో మీడియాతో మాట్లాడుతూ ఆయన సూచించారు. మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, ఎంకే స్టాలిన్, తేజస్వి యాదవ్ వంటి సమర్ధులైన నేతలు రాహుల్ గాంధీ నుంచి పగ్గాలు చేపట్టాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల పలు ఎన్నికల్లో వైఫల్యాలను చవిచూడడాన్ని అయ్యర్ ప్రస్తావిస్తూ, మమతా బెనర్జీని దూరం చేసుకోవడం వల్లే కాంగ్రెస్ బలహీనపడిందని అభిప్రాయపడ్డారు. మమతా బెనర్జీ లేకుంటే 'ఇండియా' కూటమి ఉనికికే ప్రమాదమని అన్నారు. కూటమి బాధ్యతలను తన చేతిలో పెట్టుకోకుండా ప్రాంతీయ పార్టీల నేతలైన స్టాలిన్, మమతా దీదీ, అఖిలేష్, తేజస్వి, ఇంకెవరికైనా రాహుల్ గాంధీ అప్పగిస్తారని ఆశిస్తున్నానని, వారయితే ఎక్కువ సమయం కేటాయించగలరని అయ్యర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీపై మణిశంకర్ అయ్యర్ నిశిత విమర్శలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్న ఒక కార్యక్రమానికి అయ్యర్ హాజరయ్యారు. పినరయి విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనపై ప్రశంసలు కురిపించారు. త్వరలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పినరయి విజయన్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. మణిశంకర్ అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదని, ఆయన వ్యాఖ్యలు, వ్యాసాలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని పేర్కొంది. కాగా, 'ఇండియా' కూటమి నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవాలంటూ అయ్యర్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ వెంటనే స్పందించింది. రాహుల్ గాంధీ మాత్రమే ఇండియా కూటమిని సమర్ధవంతంగా ముందుకు నడిపించగలరని, బీజేపీని ఎదుర్కొనగలిగే సత్తా రాహుల్‌కే ఉందని ఆ పార్టీ నేత ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు. బెంగాల్ కాంగ్రెస్ నేతలు సైతం అయ్యర్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చాలాకాలంగా మణిశంకర్ అయ్యర్ దూరంగా ఉన్నారని, బెంగాల్ నుంచి ఐదు రాజ్యసభ సీట్లు ఖాళీగా ఉండటమే మణిశంకర్ అయ్యర్ తాజా వ్యాఖ్యలకు కారణం కావచ్చని బెంగాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుమన్ రాయ్ అన్నారు.

# తమినాడులో సర్ ప్రక్రియ పూర్తి

## రాష్ట్రంలో 74 లక్షల మంది ఓటర్ల తొలగింపు

## తుది జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం

**చెన్నై,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

తమిళనాడు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియ పూర్తికావడంతో తుది జాబితాను ఎన్నికల సంఘం సోమవారంనాడు విడుదల చేసింది. సవరించిన జాబితా కింద రాష్ట్రంలోని 74 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి ఈసీ తొలగించింది. మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్ల బాజితాలో చోటుచేసుకున్నారు. ఎస్ఐఆర్ పక్రియకు ముందు 6.41 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. సోమవారంనాడు చెన్నైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తమిళనాడు చీఫ్ ఎలక్షన్ అధికారి అర్చనా పట్నాయక్ ఈ జాబితాను విడుదల చేశారు. తాజా జాబితాలో 5.67 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా, వీరిలో 2.77 కోట్ల మంది పురుషులు, 2.89 కోట్ల మంది మహిళలు 7,617 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. ÷-లకెయిమ్‌లు, అబ్జెక్షన్ పీరియడ్‌లో దాఖలు చేసిన దరఖాస్తులను సమీక్షించి మార్పులు చేసినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. 2025 డిసెంబర్ 19 నుంచి 2026 జనవరి 30 వరకూ ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించాల్సిందిగా 4.38 లక్షల అప్లికేషన్లు వచ్చాయని, వీటిలో 4.23 లక్షల ఎంట్రీలను వెరిఫికేషన్ అనంతరం తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించామని పేర్కొంది. ÷ూగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ వేసవి సీజన్‌లోనే జరగనున్నాయి.

# నల్లగొండలో డెస్క్ జర్నలిస్టుల ఆందోళన

**నల్లగొండ,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**




అక్రిడిటేషన్ల విషయంలో డెస్క్ జర్నలిస్టులకు చాలా అన్యాయం జరుగుతోందని, అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య పెంచి అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) ఆధ్వర్యంలో సోమవారం వివిధ పత్రికల డెస్క్ జర్నలిస్టులు సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల సంఖ్య భారీగా తగ్గించారని, గతంలో ప్రతి జిల్లాకు ఐదుగురికి, ఎడిషన్ సెంటర్‌లో 8 మంది డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వగా ప్రస్తుతం కేవలం ఎడిషన్ సెంటర్‌కు నాలుగు అక్రిడిటేషన్లు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టారని, ఈ నిబంధన వల్ల చాలామంది డెస్క్ జర్నలిస్టులు అక్రిడిటేషన్లకు దూరం అవుతున్నారని మండిపడ్డారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పనిచేసినా ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్క్‌లు వేరుగా ఉంటాయని ప్రతి జిల్లాకు ఒక ఇన్‌చార్జితో పాటు నలుగురు సబ్ ఎడిటర్లు ఉంటారన్నారు. జీఓ ప్రకారం ఎడిషన్‌కు నాలుగు కార్డులే ఇస్తే కనీసం ఆ జిల్లాల ఇన్‌చార్జిలకు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో పనిచేసే తాము తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేనివాళ్లమని, కనీసం అక్రిడిటేషన్ కార్డు ఉంటే హెల్త్ కార్డు అయినా తమకు ఉపయోగపడుతుందన్నారు.

# తిరుమలలో నాకాబందీ

## విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు

## ఆరు ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు


**తిరుమల,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

తిరుమలలో యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. తిరుమల డీఎస్పీ పర్యవేక్షణలో బాలాజీ నగర్ ప్రాంతంలో విస్తృత స్థాయి నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్, ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఫైర్ శాఖ, టీటీడీ రెవెన్యూ, రెవెన్యూ శాఖ, బిడి టీమ్స్, ఎక్సైజ్ శాఖ, హెల్త్ శాఖలకు చెందిన సుమారు 90 మంది సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 6 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో బాలాజీ నగర్ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా టీటీడీ కేటాయించిన నివాసాల్లో అనుమతిపొందిన వ్యక్తులే ఉంటున్నారా లేదా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా నివసిస్తున్నారా అనే కోణంలో పరిశీలన చేపట్టబడింది. ప్రతి విభాగం వారు తమ తమ శాఖలకు సంబంధించిన అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ నాఖాబందీ కార్యక్రమంలో మొత్తం 820 ఇళ్లను తనిఖీ చేయగా, సరైన గుర్తింపు కార్డులు లేని 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకు న్నారు. అలాగే గుర్తింపు పత్రాలు లేని 11 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు స్థానికులతో సమావేశమై, తమ ఇళ్లను అపరిచిత వ్యక్తులకు బాడుగకు ఇవ్వవద్దని, సరైన గుర్తింపు లేకుండా ఎవరినీ పనులకు నియమించవద్దని సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. స్థానిక నివాసులు ఈ నాఖాబందీ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకారం అందించగా, తిరుమలలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ, ఆదేశాల మేరకు, తిరుమల అదనపు ఎస్పీ సూచనలతో ఈ తనిఖీలు చేపట్టారు.

# వైభవంగా సాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు

## గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు

**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం యాదగిరీశుడిని 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో భక్తులు సేవించారు. భక్తజన రక్షణెళి ధ్యేయంగా అవతారాలు దాల్చిన స్వామివారు ప్రకృతి బీభత్సం నుంచి కాపాడే భక్తజన బాంధవుడిగా శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింభించే అలంకరణలో దివ్య మనోహరంగా భక్తజనులకు దర్శనమిచ్చారు. తన చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టి గోపాలులను రక్షించిన మహిమలను అర్చకులు అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు.భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. ఉత్సవాలను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు సింహ వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.



# పోలీస్ అధికారి సునీల్ కుమార్‌కు చుక్కెదురు

## సస్పెన్షన్ పొడిగించిన ప్రభుత్వం

**అమరావతి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం జూన్ 30వరకూ పొడిగించింది. ఆయనపై ఉన్న కేసుల దృష్ట్యా పవీవిరమణ వరకు ఇక విధుల్లో చేరే అవకాశం లేకుండా పోయింది. ఈ నెల 24 నాటికి ఆయన సస్పెన్షన్ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో 18న భేటీ అయిన రివ్యూ కమిటీ ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంతో పాటు అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో హింసించిన కేసుల్లో సునీల్ కుమార్‌పై విచారణ కొనసాగుతోంది. వీటితో పాటు ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణ చర్యలపై సోషల్ మీడియా వేదికగా ఆయన వ్యాఖ్యలు చేసిన అంశంపై విచారణాధికారి తన నివేదికను సమర్పించాల్సి ఉంది.ప్రస్తుతం నాలుగు కేసుల్లో ఆయనపై విచారణ జరుగుతున్నందున సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా రివ్యూ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌ను తొలగించడం సబబు కాదని ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆయనపై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్ పూర్తయ్యే వరకూ లేదా పదవీ విరమణల్లో ఏది ముందైతే అప్పటి వరకూ సస్పెన్షన్‌లో కొనసాగించాలని కమిటీ చేసిన సిఫారసులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అభియోగాలపై సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం తొలుత 2025 మార్చి 2న సస్పెండ్ చేసింది. అప్పటి నుంచీ ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు.

# శ్రీకాకుళంలో డయేరియా కేసులు

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి నారాయణ

**అమరావతి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

శ్రీకాకుళం జిల్లాలో డయేరియా కేసులు నమోదు కావడంపై రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెంటనే స్పందించారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ , నగరపాలక సంస్థ కమిషనర్‌తో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడి తాజా పరిస్థితిని సమీక్షించారు. డయేరియా ప్రబలడానికి ప్రధాన కారణాలు ఏంటి?

# ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

## గంటముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు

**అమరావతి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ స్జబెక్టులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ స్జబెక్టులకు, రెండో సంవత్సరం అన్ని స్జబెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు.విద్యార్దులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లకుండా పరిశీలించి లోపలికి అనుమతించారు. బాలురు కు పురుషులు, బాలికలకు మహిళా సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్దులు వెంట తల్లి తండ్రులు వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు..విద్యార్దులు ఉత్సాహంగా ఒకరిని ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ లోపలికి వెళ్ళారు. ఉదయం చేరుకున్న విద్యార్దులు వారి యొక్క హాల్ టికెట్స్ నెంబర్ల సరి చూసుకొని పరీక్ష కేంద్రం లోపలికి వెళ్ళారు.



# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విజయనగరం,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కె.ఎల్. పురంలోని శ్రీ లక్ష్మీగణపతి జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న గదులను సందర్శించి, వారికి కల్పించిన వసతులపై అధికారులను ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎక్కడా అవకాశం లేకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు వంటి కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

# రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు

## బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్

**అమరావతి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**



రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సునీల్ నాయక్ ఏపీ సీఐడీలో ఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2021లో రాజద్రోహం కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో, సీఐడీ కస్టడీలో ఉండగా తనపై సునీల్ నాయక్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. తన కాళ్లపై తీవ్రంగా కొట్టడం, మానసికంగా వేధించడం వంటి చర్యల్లో సునీల్ నాయక్ కీలక పాత్ర పోషించారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే ఏపీ పోలీసులు బిహార్ ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందించారు. పట్నాలోని స్థానిక కోర్టులో ఆయనను హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ కోరారు. కోర్టు అనుమతి లభించడంతో ఇవాళ రాత్రికి ఆయనను విమానంలో లేదా రోడ్డు మార్గంలో గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ అరెస్టుతో ఏపీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందనే సంకేతాలు ఈ ఘటనతో స్పష్టమవుతున్నాయి. ఈ కేసులో మరికొందరు ఉన్నతాధికారులు కూడా విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

# నది దాటుకుంటూ వచ్చిన విద్యార్థులు

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థిని హాజరు

**విజయవాడ**



మన్యం జిల్లాలోని నాగవల్లి నది దాటుకుంటూ ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు రాయడానికి విద్యార్థులువెళ్లారు. వేరే మార్గం లేక వారు నది దీటుకుంటూ వచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం చాణక్య కాలేజీకి చెందిన యర్రా హేమశ్రీ ఉప్పులూరు గ్రామానికి చెందిన విద్యార్ధి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినా సోమవారం ఇంటర్ మీడీయట్ పరిక్షలకు తన తండ్రి సహకారంతో హజరైనట్లు చాణక్య కాలేజీ ప్రతినిధి చెప్పారు. హేమశ్రీ తన కాలేజీలో బెస్ట్ విద్యార్ధిని చెప్పారు. నడవలేని స్తితిలో ఉన్నప్పటి హేమశ్రీ పరిక్షలకు హజరైనట్లు చెప్పారు. మార్చి 24 వరకు జరగనున్న పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా వెల్లడించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సిసిటివి కెమెరాల నిఘా ఉంటుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో జిల్లా స్థాయి పరీక్షా కమిటీలు (డిఇసి), ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు నిరంతరం తనిఖీలు చేస్తాయని పేర్కొన్నారు. పరీక్ష సమయం దాటి నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని, విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అత్యవసర సమస్యల కోసం బోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోల్ ఫ్రీ నెంబరు 18004251531కు ఫోన్ చేయాలని వెల్లడించారు.

# ప్రారంభం అయిన ఇంటర్ పరీక్షలు

## కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు

**తెనాలి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ఇంటర్ పరీక్షలుప్రారంభం అయ్యాయి. ఇంటర్ బోర్డ్ కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తిచేసింది. ప్రశాంత వాతావరణం నడుమ అన్ని పరీక్ష కేంద్రాలు వద్ద పోలీస్ శాఖ బందోబస్త్ కట్టుదిట్టం చేశారు. విద్యార్ధులకు మౌలిక సదుపాయాలు కల్పనలో ఎటువంటి అలసత్వం వహించవద్దని అధికారులు ఆదేశాలు జారీచేశారు. స్థానిక కొత్తపేట వివేక కళాశాల పరీక్ష కేంద్రం వద్ద వన్ టౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో తెనాలి డిఎస్పీ జనార్ధనరావు పర్యవేక్షణలో తెనాలి డివిజన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేవిధంగా భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

## ఇప్పటికే నలుగురు మృతి..మరో నలుగురి పరిస్థితి విషమం

## పాలవ్యాపారి గణెశిశ్ అరెస్ట్.. పరీక్షలకు పాల నమూనాలు

**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పాలు కల్తీ కావడంతో మరణించారని తెలుస్తోంది. దీంతో పాలు పోసే వ్యక్తి గాణెశిశ్‌ను అరెస్ట్ చేశారు. పాలను పరీక్షలకు పంపారు. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణెశిష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. ఆ నమూనాల నివేదికలు రావాల్సి ఉంది.

# కనీస వేతనలు 26వేలకు పెంచాలి

## చీపురుపల్లిలోలో అంగన్‌వాడీల ఆందోళన

**చీపురుపల్లి,ఫిబ్రవరి23(ప్రజా వీక్షణం న్యూస్,):**

తమ సమస్యలను పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు ఆధ్వర్యంలో చీపురుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సోమవారం నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు అంబాల గౌరి నాయుడు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టీ మాలతి, నాగమణి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన విధంగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా అంగన్వాడీలను ఇబ్బందులు గురిచేస్తుందని వారు అన్నారు. ఫిబ్రవరి నుండి జరిగే బడ్జెట్ సమావేశాలలో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని మిగిలిన మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్లను క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంట్రల్ గా మార్చాలని వారు కోరారు. గ్రాట్యూటీ అమలకు గ్లడైన్స్ రూపొందించి వేతనముతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్ మరియు రూరల్ అనే తేడా లేకుండా అందరికీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లు నిర్దిష్టమైన గ్లడైన్స్ రూపొందించి అమలు చేయాలని అలాగే పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వాడు ప్రభుత్వాన్ని కోరారు. మే నెల అంతా వేసవి సెలవుల జీవో ప్రకటించాలని కోరారు. వీటితోపాటు లబ్దిదారులకు బియ్యం ఆయిల్ కందిపప్పు లకు సంబంధించి క్వాంటిటీ పెంచాలని మెనూ చార్జీలు పెంచడంతోపాటు ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు అంతేకాకుండా ప్రీస్కూల్ బలోపేతం చేయాలని ఫ్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందన పథకాన్ని అమలు చేయాలని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్వాడి సెంటర్ లో ఉండాలని జీవో ఇవ్వాలని వర్కోరారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకుంటే తాము ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం

## : ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.మొత్తం 154 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. ముందుగా గత ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ, పంచాయతీ రాజ్ శాఖా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ప్రజా వీక్షణం న్యూస్, నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 23.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలు తనికి చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవి కాలం సమీపిస్తున్నందున విద్యార్థులకు నీటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల మౌళిక సదుపాయాల కల్పన పనులు, మరమ్మత్తులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, అంగన్వాడి భవన నిర్మాణ పనులు, మండల ప్రత్యేక అధికారులు పరిశీలిస్తూ, నిర్మాణాల ప్రగతి, నాణ్యత పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో శంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

## : ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

లైసెన్సుడు సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్లో సోమవారం 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాలు ఇంచార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకొని, పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాకు చెందిన 66 మంది సర్వేయర్లకు లైసెన్సులు గతంలో అందజేసిందని గుర్తు చేశారు. గత ఏడాది జిల్లాకు చెందిన సివిల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన వారికి 50 రోజుల పాటు శిక్షణ ప్రభుత్వం అందించిందని, వారిలో శిక్షణ పూర్తి చేసుకొని పరీక్షలో పాస్ అయిన 25 మందికి లైసెన్స్ పత్రాలను అందించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.లైసెన్స్ పొందిన వారు అందరూ వారికి కేటాయించిన మండలాల్లో అందుబాటులో ఉండాలని, ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, నటరాజ్ సిబ్బంది ఉన్నారు.



# ఉత్తమ పాఠశాల అవార్డుకు న్యూ హరిజోన్స్ స్కూల్ ఎంపిక

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి బాల్కొండ

అపెక్స్ ఏడ్యూకేషన్ వారి ఓలంపియాడ్ జాతీయ స్థాయి పోటీలో ముప్కాల్ మండలం న్యూ హరిజోన్స్ స్కూల్ విద్యార్థులు ఫాతిమా స్టేట్ లెవల్ లో మూడవ ర్యాంక్, శ్రీహన్ జోనల్ లెవెల్ లో ఫస్ట్ ర్యాంక్, సృజన్ జోనల్ లెవల్ లో మూడవ ర్యాంక్ సాధించడంతో రాష్ట్రస్థాయిలో ఆ పాఠశాల ఉత్తమ పాఠశాల అవార్డుకు ఎంపికైంది. దీంతో పాఠశాల యాజమాన్యం కూడా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భూస రత్నాకర్, ఉపాధ్యాయినులు శైలజ, కారుణ్యలు పాల్గొన్నారు.




# లైసెన్స్డ్ సర్వేయర్లకు సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్

ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 23 :


విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 46 మంది లైసెన్స్డ్ సర్వేయర్లకు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు లైసెన్స్డ్ సర్వేయర్లకు ప్రభుత్వం శిక్షణ ఇప్పించి, వారి సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని లైసెన్సుడ్ సర్వేయర్లు బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు. ఎలాంటి అవినీతి ఆరోపణలకు తావు లేకుండా నిజాయితీగా సర్వే నివేదికలు సమర్పించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారము మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్రెడ్డి, ఉప సర్పంచ్ విజయ్ రెడ్డి, వార్డు సభ్యుల చేతుల మీదుగా బాధితుల ఇంటింటికి తరలి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మేము పాలకులం కాదు.. సేవకులమని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాసు, మిడిదొడ్డి భాను, మహేందర్ రెడ్డి, ఉచ్చిడి బాల్ రెడ్డి పాల్గొన్నారు.



# అందరి సహకారంతో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు:అధికారులను సత్కరించిన కలెక్టర్

ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 23 :

అందరి సహకారంతో జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల ఎన్నికలు సాఫీగా ముగిసిన నేపథ్యంలో సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మున్సిపల్ కమిషనర్లను, ఎన్నికల విధులలో క్రియాశీలకంగా వ్యవహరించిన అధికారులను కలెక్టర్ సన్మానించారు. అధికారులు, సిబ్బంది అందరూ పరస్పర సమన్వయంతో కృషి చేసిన ఫలితంగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించుకోగలిగామని అన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఎ.ఓ ప్రశాంత్ పాల్గొనగా, బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవిబాబు, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ కమిషనర్లు జాదవ్ కృష్ణ, ఉమా మహేశ్వర్ రావు, గంగాధర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, రిటర్నింగ్ అధికారులు నర్సయ్య, జి.నరేష్, జే.బస్వంత్, హఫీజుద్దీన్ లను కలెక్టర్ సత్కరించారు. కాగా, అధికారులు అందరు కలిసి జిల్లా ఎన్నికల అధికారి హోదాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మార్గనిర్దేశం చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఘనంగా సన్మానించారు.



# టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు అందజేత

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలం చిట్టాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారము మండల కాంగ్రెస్ అధ్యక్షులు గున్నాల వెంకటేశ్ గౌడ్, పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. స్థానిక సర్పంచ్ సట్ల ప్రవీణ్, ఉపాధ్యాయుల బృందం నాయకులు గంగ మల్లు, గంగాధర్, పవన్ పాల్గొన్నారు.



# ప్రజావాణికి 107 ఫిర్యాదులు

ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 23 :



ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 107 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
మంగళవారం 24 ఫిబ్రవరి 2026
www.prajaveekshanam.in

## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రం అందజేసిన కలెక్టర్

ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 23 :

ఎక్సైజ్ కానిస్టేబుల్ కుమారి గాజుల సౌమ్య సోదరుడు గాజుల శ్రవణ్ కు ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించగా, ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం తన చాంబర్ లో ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. విధి నిర్వహణలో భాగంగా ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య గత నెల 23వ తేదీన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో గంజాయి స్మగ్లర్లు కారుతో ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి తొమ్మిది రోజులు మృత్యువుతో పోరాడి జనవరి 31న చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. సౌమ్య అంత్యక్రియలను ప్రభుత్వం అధికార లాంచనాలతో జరిపించడమే కాకుండా, ఇటీవలే నిజామాబాద్ పర్యటనకు హాజరైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన చేతుల మీదుగా సౌమ్య కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియాను అందించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. ఈ మేరకు సౌమ్య సోదరుడు గాజుల శ్రవణ్ కు ఎక్సైజ్ శాఖ లో జూనియర్ అసిస్టెంట్ గా ప్రభుత్వం ఉద్యోగం కల్పించగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి నియామక పత్రం అదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంఘటన జరిగిన నెల రోజుల లోపే సౌమ్య కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా, సౌమ్య సోదరుడు శ్రవణ్ కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని అన్నారు. బాధిత కుటుంబానికి ఇకముందు కూడా ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటుగా నిలుస్తుందని కలెక్టర్ భరోసా కల్పించారు. సౌమ్య మరణానికి కారకులైన వారిని కఠినముగా శిక్ష పడేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లోఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, సీ.ఐ స్వప్న, ఎస్.ఐ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే మా లక్ష్యం
### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రజా వీక్షణం న్యూస్ రామచంద్రాపురం

నియోజకవర్గ ప్రజల సంక్షేమం ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలు పట్టణాలు డివిజన్లకు సంబంధించిన 54 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 24 లక్షల 43 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేసి మాట్లాడుతూ వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు దీని ద్వారా ప్రతి నెల లక్షలాది రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎల్ఓసిలు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం సీనియర్ నాయకులు సత్యనారాయణ వెంకటేష్ ఐలేష్ రామచంద్రా రెడ్డి శివరాజ్ శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## రానున్న గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్ లు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజా వీక్షణం న్యూస్, నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 23.

రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.సోమవారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ గోదావరి నది పుష్కరాల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, రాబోయే గోదావరి నది పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే సంబంధిత అధికారులు అందరితో, పుష్కరాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించినట్లు వివరించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం, పుష్కర ఘాట్ వద్దకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, దానికి తగ్గట్టుగానే ఏర్పాట్లను చేస్తామని చెప్పారు. ప్రతి పుష్కర ఘాట్ వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఘాట్ ల నిర్మాణం, నీటి వసతి, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర వసతులు కల్పిస్తామని తెలిపారు.ఈ వీసీలో డిపిఓ శ్రీనివాస్, నీటిపారుదల ఈఈ అనిల్, జెడ్పీ సీఈవో గోవింద్, ఈఈ ఆర్ డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# 16 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

ఈ నెల 25 నుంచి వచ్చే నెల 16 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో సర్వం సిద్ధం చేశారు. పరీక్ష సమయానికంటే విద్యార్థులు గంట ముందే చేరుకోవాలి. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధం. ఈ ఏడాది పరీక్ష కేంద్రాల్లోకి నిమిషం ఆలస్యమైన అనుమతించకపోవడం నిబంధనను ప్రభుత్వం ఎత్తివేసింది. నిర్ణీత సమయం 09.00 గంటల తరువాత ఐదు నిముషాల లోపు చేరుకోవాలి.

**ఉదయం 9 గంటల నుంచి..**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4046, సెకండ్ ఇయర్ విద్యార్థులు 4060 పరీక్షకు హాజరు కానున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేశారు. మూడు సెట్ల ప్రశ్నాపత్రాలు పోలీస్ స్టేషన్లకు చేర వేశారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 8333916289 అందుబాటులో ఉంటుంది.

**144 సెక్షన్ అమలు..**

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల సమీపంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు సూచించారు. హాల్ టికెట్లు టీజిబిఐఈ వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలి. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్లు వెంట తీసుకురావాలని తెలిపారు.

**పర్యవేక్షణకు బృందాలు..**

పరీక్షల పర్యవేక్షణకు వివిధ శాఖల బృందాలు ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. 350 నుంచి 400 మంది ఇన్విజిలెటర్లను నియమించారు.

**ప్రశాంతంగా పరీక్షలు రాయాలి**

పరీక్షలు రాసే విద్యార్థులు కేంద్రాలకు గంట ముందే అనుమతిస్తారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యార్థులు ఒత్తిడిలోనుకాకుండా



ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఇన్చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.

## 26 నుండి సిరిసిల్లలో సదరన్ శిబిరాలు

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

ఈనెల 26 నుండి మార్చి 16 వరకు సాధారణ వైకల్యాలకు సంబంధించి సదరన్ శిబిరాలు నిర్వహించనున్నట్లుగా సోమవారము రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈనెల 26న కంటిచూపు, మార్చి 5న వినికిడి, సాధారణ శిబిరాలు, పదవ తేదీన మానసిక, 12, 13, 16న ఆర్థో శిబిరాలు నిర్వహిస్తారు. దివ్యాంగులు మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్ రే, యుడిఐడి అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్ తమ వెంట తీసుకుని ఉదయం 09.00 గంటలకు సదరం శిభిరంకు హాజరు ఉండాలి.

## ఉపాధ్యాయులు రెండు నెలల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి...
### మండల విద్యాధికారి నిజాముద్దీన్

ప్రజా వీక్షణం న్యూస్ కృష్ణ.... నారాయణపేట జిల్లా

మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సముదాయ సమావేశం సోమవారం స్థానిక ప్రధానోపాధ్యాయులు కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో మండల విద్యాధికారి నిజాముద్దీన్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ మిగితా రెండు నెలలకు విద్యార్థులకు చక్కగా తెలుగు, ఆంగ్లం, గణితం భోధించడానికి సరైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అలాగే, ఎఫ్ ఎల్ ఎన్ మరియు ఎఫ్ ఎల్ ఎస్ అంత్య చర్చించి ఆంగ్లంలో ఉన్న పదాలను నేర్పించే విధానం గురించి తెలిపారు. గణితంలో మౌలిక సమస్యలను సాధించే సులభ పద్ధతులను విద్యా విధానంలో చాట్ జిపిటి ఉపయోగం గురించి తెలిపారు.పరీక్షల గురించి ఆర్ పి లు అన్ని విషయాలను ఉపాధ్యాయులకు వివరించాలన్నారు ఈ కార్యక్రమం లో ఆర్ పి నల్లే శివరాజ్, హనుమదాస్, ఖాసీం అలీ, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రాజీవ్ గృహ కల్పలో ప్లాట్ల కబ్జాలను అరికట్టాలి.
### -సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం.

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రజా వీక్షణం న్యూస్,

బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహ కల్ప జరుతున్న అవినీతి పై మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లాలో ప్రజావాణి సమస్య పరిస్కారం చేయాలనీ సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం, సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహ కల్పలో దాదాపు యాభై ప్లాట్లు ఖాళీగా వున్నాయి అని వారు గుర్తు చేశారు. వాటిని స్థానికంగా కొంత మంది కబ్జా చేశారు అని , ప్రస్తుత సమాజంలో కబ్జాదారులు వేటిని వదలకుండా ప్రతిదీ కబ్జా చేస్తున్నారు. కనుక రాజీవ్ గృహ కల్ప కబ్జాకు గురిరైనా యాభై ప్లాట్లను వెంటనే పేద ప్రజలకు కేటాయించాలని వారు కోరారు. అలాగే రాజీవ్ గృహ కల్ప ప్రక్కన వున్న స్థలంలో స్థానిక ప్రజలు స్మశానవటిగా ఉపయోగించే వారు కనుక అటి స్మశాన వాటికను గుర్తించి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బక్క మల్లేష్, పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.




## 25న ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఉద్యోగ మేళా

ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగం ఉద్యోగాల కోసం ఈ నెల 25న ఉదయం 10:30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం, శివాజీ నగర్, నిజామాబాదులో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లుగా సోమవారం జిల్లా ఉపాధి అధికారి బి.పి మధుసూదన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే జిల్లాలో ఎంఎస్ఎన్ లైఫ్ సైన్సెస్, అపోలో ఫార్మసి కంపెనీ ఫార్మాసిస్టు, ఫార్మసిస్ట్ అసిస్టెంట్, ట్రైనీ ఫార్మసిస్ట్ గా పనిచేసే ఉద్యోగాలకు విద్యారత ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిఫార్మ్, బి ఫార్మ్, ఎం ఫార్మ్ (పీసీఐతో) విద్యార్హత ఉండాలి. వివరాలకు 8919743152, 7013580089, ఫోన్ ద్వారా సంప్రదించగలరు.

## నూతన వార్డు సభ్యులకు 5రోజులు శిక్షణ తరగతులు...
### శిక్షణలో పాల్గొన్న 13 గ్రామాల వార్డు మెంబర్స్ ...

ప్రజా వీక్షణం న్యూస్ కృష్ణ.... నారాయణ పేట జిల్లా

గ్రామీణ అభివృద్ధిలో వార్డు మెంబర్స్ కీలకమని పంచాయతీరాజ్ ట్రైనర్స్ అన్నారు. నూతనంగా ఎన్నికైన 13 గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు 5రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని రైతు వేదికలో సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ట్రైనర్ కె.బుచ్చిరెడ్డి,కె. వీరన్న,యం.శ్యామసుందర్, రమేష్ మాట్లాడుతూ వార్డు మెంబర్లకు పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైన బాధ్యతలు కట్టబెట్టిందన్నారు.వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరేలా కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్ చట్టం, ఆర్థిక వ్యవహారాలు, గ్రామసభల నిర్వహణ, అభివృద్ధి పథకాల అమలు, రికార్డుల నిర్వహణపలు అంశాలపై వార్డు సభ్యులకు వివరంగా తెలియజేశారు.ఆయా గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు అందరూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి పంచాయితీ కార్యదర్శులు వార్డు మెంబర్స్ పాల్గొన్నారు.



## మున్సిపల్ చైర్మన్ కు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ శుభాకాంక్షలు

ప్రజా వీక్షణం న్యూస్ కామారెడ్డి బ్యూరో

కామారెడ్డి మునిసిపల్ చైర్మన్ గా ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. వారికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ శెట్కార్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు, అడిషనల్ కలెక్టర్ మధు మోహన్, కమీషనర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



## పాటి మల్లన్న జాతరలో ఎమ్మెల్యే జిఎంఆర్

ప్రజా వీక్షణం న్యూస్ రామచంద్రాపురం

ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం జాతర కార్యక్రమాల్లో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోటె సుమలత గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్ మాజీ ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు



# మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో మతిభ్రమించిన బిజెపి, బీఆర్ఎస్ నాయకులు

## సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి

ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్ బ్యూరో




మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బిజెపి బిఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించిందని, కామారెడ్డి ఘటనలతో పశ్చిమబెంగాల్ తరహా అల్లర్లకు బిజెపి సిద్ధమవుతున్నదని, కాంగ్రెస్ పార్టీపై అబదప్పు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి హెచ్చరిక చేశారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు తీవ్ర వైరాగ్యంలోకి వెళ్లిపోయి ప్రభుత్వాన్ని ఏ విధంగా అయినా బదనాం చేస్తూ మున్సిపల్ ఫలితాల నుంచి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, రాబోయే రెండు సంవత్సరాలలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని బిజెపి నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని, మునిసిపల్ ఎన్నికల కంటే ముందు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ పట్టణ ఫలితాలు పూర్తిగా బిజెపి వైపే ఉన్నాయని బింకాలు పలికి చివరికి ఒకటి రెండు స్థానాలకే పరిమితం అవడం జరిగిందని, మతసామరస్యానికి చిహ్నంగా ఉన్న కామారెడ్డి లాంటి ప్రాంతాల్లో చిచ్చు రేపే ప్రయత్నానికి బిజెపి తెరలేపిందని, మున్సిపల్ ఎన్నికల ఫలితాల నుండి ప్రజలను పక్కదోవ పట్టించడానికి పశ్చిమ బెంగాల్ తరహా అల్లర్లను కామారెడ్డిలో సృష్టించే ప్రయత్నం బిజెపి పార్టీ చేస్తుందని, ఇది గత మూడు రోజులుగా జరుగుతున్న పరిస్థితులను చూస్తుంటేనే అర్థం అవుతుందని మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఇంకా పది సంవత్సరాలు గడిచిన బిజెపి నాయకులు ఎన్ని కుళ్లు కుతంత్రాలు చేసిన తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడమనేది వారి కలగానే మిగిలిపోతుందని అన్నారు. మీ అంతర్గత మిత్రులు కేసీఆర్, కేటీఆర్ లతో కలిసి వచ్చిన తెలంగాణలో అధికారంలోకి రారని, కామారెడ్డి లో బిజెపి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ పై సవాల్ విసిరితే దానిని స్వీకరించి ఆధారాలతో వస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిన సందర్భంలో అక్కడ శాంతిభద్రతలను కాపాడాలని ఉద్దేశంతో పోలీసులు ఇరువర్గాల నాయకులను అదుపులో ఉంచడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గిరెడ్డి మహేందర్ రెడ్డి అటువైపుగా వెళుతుంటే బిజెపి మూకలు మున్సిపల్ మరియు పంచాయతీ ఎన్నికల్లో తీవ్రంగా విఫలమయ్యామనే ఆలోచనతో కాంగ్రెస్ నాయకుడిపై, అతని వాహనంపై చేసిన దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. పశ్చిమబెంగాల్ తరహాలో తెలంగాణలో అల్లర్లు సృష్టించాలని చేస్తున్న ఆలోచనను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ ఇకనైనా మానుకోవాలని ప్రజలకు వాస్తవాలు వివరించి ముందుకు వెళ్లాలని సూచించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు మాట్లాడే పద్ధతి సరైనదిగా ఉండాలని చెప్పిన వ్యక్తి అదుపుతప్పి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులైన షబ్బీర్ అలీ పై అన్ పార్లమెంటరీ పదాలు వాడుతూ దూషించడం సరైనది కాదు అని, కామారెడ్డి ఎమ్మెల్యే చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేకుండా ఉంది అని, భవిష్యత్తులో ఆయన తన తీరును మార్చుకోవాలని సూచించారు.

### మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో మతిభ్రమించిన ప్రశాంత్ రెడ్డి

బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి భీమ్గల్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో మానసిక స్థితిని కోల్పోయాడని, రైతుల సమస్యలపై పోరాడితే రైతులపై కేసులు పెడతారా అని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తూ నిన్న ప్రశాంత్ రెడ్డి ర్యాలీ ధర్నా చేయడం జరిగిందని, ప్రశాంత్ రెడ్డి ఒక్కసారి గతంలో తన 9 సంవత్సరాల పాలనలో ఎవరు ఏ ప్రభుత్వం రైతులపై కక్షపూరిత చర్యలకు పాల్పడిందో మీకే అర్థమవుతుంది అని, బాల్కొండ నియోజకవర్గంలో లీకేజీ వాటర్ కొరకు ఉద్యమం చేసిన మహిళలపై కేసులు పెట్టిన నీచమైన చరిత్ర మీ టిఆర్ఎస్ పార్టీది అని, భీంగల్ లో తులం బంగారం గురించి అడిగితే టిఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టారని ప్రశాంత్ రెడ్డి చెప్తున్నాడని ఒక్కసారి ఆరోజు ఏం జరిగిందో ప్రశాంత్ రెడ్డి గుర్తు చేసుకోవాలని ఒక మంత్రిని అడిగే పద్ధతి అదేనా అని మానాల మోహన్ రెడ్డి ప్రశ్నించారు. బాల్కొండ గ్రామంలో ఇఫ్తార్ విందుకు వస్తున్న సందర్భంలో మైనారిటీ సోదరుడు కారు ముందుకు వచ్చి మా ఏరియాలో సిసి రోడ్లు లేవని అడిగిన కారణంగానే కాంగ్రెస్ పార్టీ అయినందున కేసులు పెట్టి పోలీస్ స్టేషన్లో ఉంచిన చరిత్ర నీది అని, రైతు సమస్యలపై పోరాటం చేసిన నిజమైన రైతులను జైల్లో పెట్టించింది నువ్వు అని, పసుపు ఎర్ర జొన్న రైతులైన అన్వేష్ రెడ్డి, మునిపల్లి సాయి రెడ్డి , మంతిని శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ ప్రభాకర్, చాలామంది రైతులపై కేసులు పెట్టి జైల్లో పెట్టి నానా ఇబ్బందులు పెట్టిన చరిత్ర నీది కాదా అని ప్రశాంత్ రెడ్డి ఆలోచించుకోవాలని మానాల మోహన్ రెడ్డి అన్నారు. ప్రశాంత్ రెడ్డి రైతుల గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంటుంది అని, ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని రెండు ఓటములకే ప్రశాంత్ రెడ్డి మానసికంగా ఇంత ఇబ్బందులు పడితే భవిష్యత్తులో ఇంకా ఎన్నికల్లో పోటీ చేసేది ఉంది అని ఒక ఓటమితోనే కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న నీ తీరు క్షమించరానిదని అన్నారు. గ్రామ పంచాయతీ,మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి బీఆర్ఎస్ తమకు జరిగిన అవమానకర ఓటమిని కప్పిపుచ్చుకోని ప్రజల్లోకి రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని వాస్తవాలు చూసి మాట్లాడాలని, మత కల్లోహాలు సృష్టించాలని బీజేపీ పార్టీ, అబద్ధపు ప్రచారాలతో కాంగ్రెస్ పార్టీని బదనం చేయాలనే ఆలోచనతో బిఆర్ఎస్ పార్టీ చూస్తున్న తీరును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది అని అన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు వైశాక్షి సంతోష్ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగా ప్రసాద్, జిల్లా ఫిషరీస్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సకినాల శివప్రసాద్, సాయికిరణ్, కౌశిక్ శివ పాల్గొన్నారు.

# వేముల ప్రశాంత్ రెడ్డి.. మీకు రైతుల తరపున మాట్లాడే కనీస అర్హత కూడా లేదు

## కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి బాల్కొండ



ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి.. మీరు రైతుల తరపున మాట్లాడే కనీస అర్హత లేదని సోమవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొండి 9 ఏళ్ల మీ దుర్మార్గ పరిపాలనలో రైతులను ఎన్ని గోసాలు పెట్టారో మా రైతులు ఎన్ని అవస్థలు పడ్డారో ఇంకా మర్చిపోలేదని, పంటలు ఎండిపోతున్నాయి కనీసం లీకేజీ నీళ్లు అయినా ఇవ్వండి అని రైతులు రోడ్డెక్కితే మహిళా రైతులని కూడా చూడకుండా కేసులు పెట్టిన చరిత్ర మీదని అన్నారు. సునీల్ రెడ్డి మాటల్లో యథాతథంగా.. ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన బద్దం రజిత అనే మహిళ రైతుపై నువ్వు కేసులు పెట్టించావు కొంతకాలం క్రితం ఆమె గుండెపోటుతో మరణించింది. మీరు చేసిన పాపం కడుక్కుంటే పోతుందా అని ప్రశ్నించారు.మీ ఏలుబడిలో ఎంతోమంది రైతులపై కేసులు పెట్టించావు వాళ్లు సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టు తిరిగారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పార్టీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పేరు సంపాదించింది. ఇప్పుడు మీ కండ్లు మండి కడుపులో విషం పెట్టుకుని ప్రభుత్వం మీద దుష్ప్రచారం చేస్తున్నావ్. రైతులతో కాకుండా నీ పార్టీ కార్యకర్తలతో రోడ్డు మీదికి వచ్చి నానా అంగడి సృష్టించి ప్రజలను ఇబ్బంది పెట్టి రైతుల కోసం పోరాడితే కేసులు పెట్టారని దొంగ మాటలు మాట్లాడుతున్నావ్. నిన్ను నమ్మే పరిస్థితుల్లో బాల్కొండ నియోజకవర్గ రైతాంగం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డే మా రైతులకు శ్రీరామరక్ష అన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీ.. చికిత్స పొందుతూ ఒకరి మృతి

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం శివారు ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం, బైకును ఢీకొన్న ఘటనలో గూడెం వైపు వెళ్తున్న వాహన చోదకుడు, నామాపూర్ బొమ్మెన లలిత ఎల్లం దంపతుల కొడుకు చందు (25) తీవ్రంగా గాయపడగా, స్థానికులు అతన్ని సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతున్న క్రమంలో సోమవారం మధ్యాహ్నం అతను మృతి చెందాడు. ఈ ఘటనపై ఎఎస్సై అబ్దుల్ గని దర్యాప్తు చేపట్టారు.

# రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలి

## : తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

ప్రజా వీక్షణం న్యూస్ హైదరాబాద్ బ్యూరో

గత 12 సంవత్సరాలలో అటు బిఆర్ఎస్ ప్రభుత్వం ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు బడ్జెట్లో నిధులు తగ్గించడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య 2021 -22లో 27 లక్షల ఉంటే, అది ప్రస్తుతం 16 లక్షలకు పడిపోయిందని ప్రొ. కే.చక్రధర్ రావు అన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఐదు సంవత్సరాలలో విద్యార్థుల సంఖ్య వేగంగా పడిపోయి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఒక్క శాతం కూడా మిగలరని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని విద్యా బడ్జెట్ రాజస్థాన్,బీహార్ కంటే కూడా తక్కువగా ఉందని సి.పి.ఐ.యం.ఎల్. న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవర్ధన్ చెప్పారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు హనుమేష్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో 1267 ప్రొఫెసర్లు ఉండవలసిన చోట 936 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే యూనివర్సిటీ విద్య ఏ స్థాయిలో దిగజారిందో తెలుస్తుందని చెప్పారు. ఇదే సమావేశంలో ప్రొఫెసర్ శివారెడ్డి మాట్లాడుతూ విద్యా బడ్జెట్ తక్కువగా ఉండడం వలన అవసరం ఉన్నన్ని గదులు లేని పాఠశాలలు 13వేల వరకు ఉన్నాయని, పక్కా కాంపౌండ్ గోడలు లేనివి 13వేల వరకు ఉన్నాయని.....అలాగే దాదాపు 20వేల స్కూల్లో సగటున ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితులలో నాణ్యమైన విద్య అందడం అసాధ్యమని ఆయన చెప్పారు. ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ 2024 ఆసర్ రిపోర్ట్ ప్రకారం 8వ తరగతి విద్యార్థులు రెండవ తరగతి పుస్తకం చదవలేకపోతున్నారంటే తెలంగాణలో విద్యా ప్రమాణాలు అత్యంత వేగంగా తగ్గిపోతున్నాయని అర్థమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలనే డిమాండ్కు తమ మద్దతు తెలుపుతున్నానని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఎంవిఎఫ్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు ఆర్. వెంకట రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులున్నా కూడా ఉపాధ్యాయులను నియమించకపోవడం దుర్మార్గమని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ నుండి స్టాలిన్, బాలల హక్కుల సంక్షేమ సంఘం నుండి ఇంజమూరి రఘునందన్, టి.పి.టి.ఎఫ్. నుండి తిరుపతి, డిటిఎఫ్ నుండి సోమయ్య తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నుండి వై.అశోక్ కుమార్, యం.రఘుశంకర్ రెడ్డి, కె.రవిచందర్, ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణలు, టి.యు.సి.ఐ. నుండి కే ప్రదీప్, పిడియస్యు నుండి పి మహేష్ గురుకుల ఉపాధ్యాయ సంఘం నుండి సదానందం తదితరులు పాల్గొని మాట్లాడారు.




# కాంగ్రెస్ ఇన్చార్జిని సన్మానించిన కౌన్సిలర్లు

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

సిరిసిల్ల పట్టణ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీకౌన్సిలర్లు సోమవారం సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు.



# ఘనంగా సంత్ గాడ్గే బాబా 150వ,జయంతి వేడుకలు.

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి

వనపర్తి మండలం వనపర్తి జిల్లా.

స్వచ్ఛతకు ఆద్యుడు గాడ్గే బాబా
అభినవ బుద్ధుడు గాడ్గే బాబా
సంఘసంస్కర్త గాడ్గే బాబా
ఆధ్యాత్మిక చైతన్య దీపిక గాడ్గే బాబా
అంటరానితనం నిర్మూలన యోధుడు గాడ్గే బాబా

వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలోచీపురు దండు వ్యవస్థాపకుడు సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా 150వ,జయంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజా వాగ్గేయకారుడురాజారాంప్రకాష్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశం గర్వించదగ్గ మహా వ్యక్తుల్లో గాడ్గే బాబా ఒకరు జ్ఞానం బుద్ధి వివేకం మానవత్వం సర్వ మానవులందరు సమానము చెప్పినటువంటి జ్ఞాన పిపాసి సంత్ గాడ్గే బాబా తన జీవిత కాలంలో పీడిత జాతుల్లోలో ఉన్న అజ్ఞానాంధకారాన్ని తొలగించడానికి ఎన్నో పాఠశాలను ఏర్పాటు చేసినటువంటి గొప్ప విద్యా దాత సంఘసంస్కర్త సమాజ హితాన్ని కాంక్షించిన అటువంటి గొప్ప వ్యక్తి సంత్ గాడ్గే బాబా సాధువు సంఘసంస్కర్త సంచార బిక్షువు సంత్ గాడ్గే బాబా నిరక్షరాస్యులైన సాధువు సంఘసంస్కర్త ఆధ్యాత్మిక చైతన్య దీపిక స్వచ్ఛత ఉద్యమం కుల నిర్మూలన పరిశుభ్రత అంటరానితనం నిర్మూలన మొదలైనటువంటి పోరాటాలు చేసి చేసిన యోధుడు ఆయన .తన కీర్తన సందర్భంలో దశసూత్రాలు చెప్పేవాడు అప్పు చేసి తీర్థయాత్రలకు వెళ్ళకూడదు ఆవులను ఎద్దులను ప్రేమగా చూసుకోండి మీ పిల్లలు తప్పనిసరిగా చదివించండి దేవుడి పేరుతో మేకలను కోళ్లను బలి ఇవ్వడం మానేయండి మీ తల్లిదండ్రులను సేవించండి పెండ్లిలో కట్నాల ను దూరంగా ఉండండి ఆకలిగా ఉన్న వారికి అన్నం పెట్టండి అంటరానితనాన్ని పాటించ కండి మద్యాన్ని సేవించకండి దేవుడిని కీర్తించడం ఎప్పుడు మర్చిపోకండి అంటూ సమాజ మార్పు కోసం నిత్యం తన బోధనలతో జనచైతన్య చేసినటువంటి గొప్ప వ్యక్తి . ఆకలితో ఉన్నవారికి ఆహారం దాహంతో అలమటిస్తున్న వారికి నీరు దుస్తులు లేనివారికి వస్త్రాలు పేదలకు నాణ్యమైన విద్య రోగులకు వైద్యం తలదాచు కునేందుకు నివాసం జంతువులకు రక్షణ నిరుద్యోగులకు ఉపాధి నిస్సహాయులకు ఆలంబన పేద యువతీ యువకులకు వివాహం జరగాలని ఆశించి అందుకోసం జీవితమంత కృషిచేసిన మాహా యోగి అతడు.మహారాష్ట్రలో 150 పాఠశాలలు ధర్మశాలలు శరణాలయాలు గోశాలలు ఆసుపత్రులు విద్యార్థినీ విద్యార్థులకు వసతి గృహాలు నిర్మించారు .సంచార సన్యాసిగా ఉన్న గాడ్గే బాబా గ్రామాలలో ఉన్న అపరిశుభ్రత ను రూపుమాపి శుభ్రపరిచేందుకు చీపురు దండును నెలకొల్పాడు ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామం గా ఉండాలని ఆకాంక్షించారు అందుకోసం ప్రతి గ్రామంలో చీపురుకట్టపేరుతో చీపురు దండు సంఘం ని ఏర్పాటు చేసినాడు, కుల వివక్ష పై పోరాటాలు జంతువులబలికి వ్యతిరేకంగా పోరాటం, విద్యా సేవ, రోగులకు సహాయ సహకారాలపై పోరాటం చేసిన యోధుడు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కి, మహాత్మా గాంధీ కి, నెహ్రూకు స్ఫూర్తి గా నిలిచిన స్ఫూర్తి ప్రదాత ఆయన భారతదేశంలో మన ప్రధానమంత్రి స్వచ్ఛభారత్ స్వచ్ఛ తెలంగాణ స్వచ్ఛ గ్రామం ,స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలకు నిర్వహించడానికి స్ఫూర్తి కూడా సంత్ గాడ్గే బాబా అన్నారు.

ప్రతి వ్యక్తి తన పరిసరాలను శుభ్రపరుచుకుని స్వచ్ఛ గ్రామం స్వచ్ఛ ఇల్లు స్వచ్ఛ దేశం ఉండాలని సందర్భంగా ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్ కోరారు . ఈ కార్యక్రమంలో కవి పండితుడు భూరోజుగిరిరాజ చారి,రజక సంఘం జిల్లా అధ్యక్షుడు ఇటిక్యాల బండలయ్య,విశ్రాంత ఇంజనీర్ శ్రీనివాసులు శెట్టి,గాయకుడు చింతకుంట కుర్మయ్య, వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీన మండ్ల దేవన్న నాయుడు, ఉపాధ్యాయులు అరవింద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

SPORTS/ BUSINESS


మంగళవారం 24 ఫిబ్రవరి 2026

www.prajaveekshanam.in

# టీమిండియా ఓటమికి ఆ రెండు తప్పిదాలే కారణం..

## టీమిండియాపై మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ ఫైర్

దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ 8 పోరులో భారత్ 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమి భారత సెమీఫైనల్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చడమే కాకుండా, జట్టు ఎంపిక, బ్యాటింగ్ క్రమంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. అశ్విన్ తన విశ్లేషణలో ప్రధానంగా అక్షర్ పటేల్‌ను జట్టు నుండి తొలగించడం, రింకూ సింగ్‌ను 8వ నంబర్‌లో బ్యాటింగ్‌కు పంపడం అనేవి జట్టు సమతూకాన్ని దెబ్బతీశాయని పేర్కొన్నారు.జట్టు యాజమాన్యం మ్యాచ్–అప్‌ల పేరుతో అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకోవడాన్ని అశ్విన్ తప్పుబట్టారు. ఐపీఎల్ వంటి సుదీర్ఘ టోర్నీలలో మ్యాచ్–అప్‌లు పని చేస్తాయని, కానీ ప్రపంచకప్ వంటి ఐసీసీ టోర్నీలలో జట్టు స్థిరత్వం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. టీ20 క్రికెట్‌లో అక్షర్ పటేల్ టీమ్ ఇండియాకు 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్'అని, గత ప్రపంచకప్‌లో కూడా దక్షిణాఫ్రికాపై ఒత్తిడిలో ఆయన అద్భుత ప్రదర్శన చేశారని అశ్విన్ గుర్తు చేశారు.సమతూకం దెబ్బతింది: అక్షర్ లేకపోవడం వల్ల మిడిల్ ఓవర్లలో జట్టుకు ఉండాల్సిన ఎడమచేతి వాటం బ్యాటింగ్ బలం తగ్గిందని, ఇది దక్షిణాఫ్రికా స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయించేలా చేసిందని



ఆయన విశ్లేషించారు. మరో ముఖ్యమైన తప్పిదం రింకూ సింగ్‌ను 8వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపడం అని అశ్విన్ అన్నారు. ఫినిషర్‌గా పేరున్న రింకూకు తగినన్ని ఓవర్లు లభించకపోవడం వల్ల భారత బ్యాటింగ్ భారీ స్కోరును సాధించలేకపోయిందని లేదా లక్ష్య ఛేదనలో వెనుకబడిందని ఆయన పేర్కొన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో నిరంతరం మార్పులు చేయడం వల్ల ఆటగాళ్ళలో అభద్రతాభావం ఏర్పడుతుందని, అది వారి సహజ సిద్ధమైన ఆటను దెబ్బతీస్తుందని అశ్విన్ హెచ్చరించారు.బ్యాటర్ల టెక్నిక్ గురించి కూడా అశ్విన్ ఘాటుగా స్పందించారు. భారత బ్యాటర్లు స్పిన్‌ను ఎదుర్కోవడంలో ప్రపంచంలోనే అత్యంత బలహీనంగా తయారయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. డిఫెన్స్ లేకపోవడం: భారత బ్యాటర్లు తమ డిఫెన్స్‌పై నమ్మకం ఉంచకుండా కేవలం భారీ షాట్లపైనే ఆధారపడుతున్నారని, ఇది తిరిగే పిచ్‌లపై ప్రమాదకరమని అన్నారు. దక్షిణాఫ్రికా స్పిన్నర్లు వికెట్లు తీస్తుంటే మన బ్యాటర్లు స్వీప్ లేదా రివర్స్ స్వీప్ షాట్లను ఆడలేకపోయారని, ఇది వారి సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతోందని విమర్శించారు. మొత్తంగా, దక్షిణాఫ్రికా జట్టు సరైన ప్రణాళికలతో వచ్చి భారత్‌ను చిత్తు చేసిందని, టీమ్ ఇండియా మాత్రం వ్యూహాత్మక గందరగోళంతో ఓటమిని కొనితెచ్చుకుందని అశ్విన్ తన రివ్యూలో కుండబద్దలు కొట్టారు.



# టీమ్ఇండియా అత్యంత చెత్త ఓటములు ఇవే..

డిఫెండింగ్ ఛాంపియన్?గా టీ20 వరల్డ్?కప్? బరిలో దిగిన టీమ్ఇండియాకు సూపర్ 8 తొలి మ్యాచ్?లోనే షాక్ తగిలింది. సౌతాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్?లో భారత్ ఘోర ఓటమి చవిచూసింది. తొలుత బంతితో, ఆ తర్వాత బ్యాటుతో పూర్తిగా విఫలమైన టీమ్ఇండియా కీలక పోరులో 76 పరుగుల తేడాతో ఓడి సెమీఫైనల్ అవకాశాలు సంక్లిష్టం చేసుకుంది. దీంతో తదుపరి రెండు మ్యాచ్?ల్లోనూ తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ టోర్నీలో గ్రూప్ దశలో ఓటమి లేకుండానే టీమ్ఇండియా సూపర్ 8కు దూసుకొచ్చింది. వరుసగా యూఎస్?ఏ, నమీబియా, పాకిస్థాన్, నెదర్లాండ్స్?పై విజయం సాధించింది. దీంతో ఇక్కడ కూడా భారత్ అదే ఫలితాలు రిపీట్ చేయాలని అభిమానులు భావించారు. కానీ, సూపర్ 8 మొదటి మ్యాచ్?లోనే గట్టి ఎదురుదెబ్బ తగలడంతో నిరాశ చెందారు. వరల్డ్? ఛాంపియన్ జట్టు ఘోర ఓటమిపాలవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకొని వరుస విజయాలు సాధించి సెమీస్?కు చేరాలని ఆశిస్తున్నారు. టీమ్ఇండియా సూపర్ కమ్?బ్యాక్ ఇవ్వాలని కోరుకుంటున్నారు. అయితే గతంలోనూ టీ20 వరల్డ్?కప్?లో భారత్ భారీ పరాజయాలు మూటగట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆయా మ్యాచ్?ల్లో ఓటమిపాలై ఆ తర్వాత పుంజుకున్న సందర్భాలూ ఉన్నాయి. టీమ్ఇండియా 2016 టీ20 వరల్డ్?కప్?ను ఊహించని ఓటమితో ఆరంభించింది. ఆ ఎడిషన్?లో తొలి మ్యాచ్?లో న్యూజిలాండ్?ను భారత్ ఢీ కొట్టింది. తొలుత బౌలింగ్ చేసిన టీమ్ఇండియా కివీస్?ను 126–7 స్కోరుకే పరిమితం చేసింది. దీంతో భారత్ అలవోకగా గెలిచేస్తుందని ఫ్యాన్స్ అనుకున్నారు. కానీ, అనుకున్నట్లు ఛేదన జరగలేదు. స్వల్ప లక్ష్యాన్ని భారత్ అందుకోలేదు. 18.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకే ఆలౌటై ఘోర ఓటమిని మూటగట్టుకుంది. ధోని (30), విరాట్ (23), అశ్విన్ (10) ముగ్గురే రెండంకెల స్కోర్ చేశారు. పొట్టి కప్పులో భారత్?కు ఇది అత్యంత ఘోర ఓటమి. అయితే ఆ తర్వాత టీమ్ఇండియా కమ్?బ్యాక్ ఇచ్చింది. అదిరే ఆటతో సెమీఫైనల్?కు దూసుకెళ్లింది. కానీ అక్కడ వెస్టిండీస్?తో ఓడింది.2014 ఎడిషన్?లో భారత్ తమ మూడో మ్యాచ్ ఆస్ట్రేలియాతో ఆడింది. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ కష్టాలు పడుతూ 20 ఓవర్లలో 140–7 స్కోర్ చేసింది. ఇర్ఫాన్ (31), రైనా (26) టాప్ స్కోరర్లు. అయితే పిచ్ బ్యాటింగ్?కు కఠినంగా ఉందని అంతా భావించారు. కానీ, ఛేదనలో సీన్ రివర్స్ అయ్యింది. తొలుత పరుగులు చేసేందుకు టీమ్ఇండియా అష్టకష్టాలు పడ్డ అదే పిచ్?పై ఆసీస్ బ్యాటర్లు చెలరేగిపోయి ఆడడం గమనార్హం. ఒకే వికెట్ కోల్పోయి 14.5 ఓవర్లలోనే ఈ టార్గెట్?ను ఛేదించి గ్రాండ్ విక్టరీ కొట్టింది.2022 ఎడిషన్?లో రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ఇండియా సెమీఫైనల్?లో అడుగుపెట్టింది. అక్కడ ఇంగ్లాండ్?ను ఢీ కొట్టింది. అయితే ఈ మ్యాచ్?లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 168–6 స్కోర్ చేసింది. హార్దిక్ పాండ్య, విరాట్ కోహ్లీ చెరో హాఫ్ సెంచరీ సాధించారు. కానీ ఛేజింగ్?లో ఇంగ్లాండ్ జెట్ స్పీడ్?తో రెచ్చిపోయింది. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 16 ఓవర్లలోనే ఇంగ్లాండ్ ఈ టార్గెట్?ను ఛేదించేసింది. ఓపెనర్లు బట్లర్ (80), అలెక్స్ హేల్స్ (86) చెలరేగి ఆడారు. వీళ్ల బ్యాటింగ్?కు టీమ్ఇండియా బౌలర్లు కళ్లెం వేయలేకపోయారు వన్?సైడ్?గా సాగిపోయిన ఈ మ్యాచ్?లో భారత్ అసలు పోటీ కూడా ఇవ్వలేకపోయింది. పొట్టి కప్పు హిస్టరీలో భారత్?కు ఇదే అత్యంత ఘోర ఓటమి అని చెప్పవచ్చు!ఐసీసీ టోర్నీల్లో పాకిస్థాన్?పై అప్పటిదాకా ఘనమైన రికార్డ్ ఉంది. 100శాతం విజయాలతో టీమ్ఇండియా ట్రాక్ రికార్డ్ ఘనంగా ఉంది. కానీ, 2021లో భారత్ తొలిసారి టీ20 వరల్డ్?కప్?లో పాక్?పై ఓటమి చవిచూసింది. దుబాయ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్?లో పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ 152 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఈ టార్గెట్?ను పాక్ ఓపెనర్లు మహ్మద్ రిజ్వాన్ (79), బాబర్ అజామ్ (68) 17.5 ఓవర్లలోనే కొట్టేశారు. ఈ మ్యాచ్? ఓటమి టీమ్ఇండియా అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. అలా 2021,2022 వరుస ఎడిషన్లలో పాక్, ఇంగ్లాండ్?పై భారత్ ఓటములు అభిమానులను బాధించాయి. కానీ ఆ తర్వాత పాక్?తో జరిగిన అన్ని ఐసీసీ ఈవెంట్లో (ప్రస్తుత వరల్డ్?కప్? సహా)నూ భారత్ ఘన విజయం సాధించింది.

# వాంఖడేలో హిట్మేయర్ ఊచకత..

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్––8 దశలో వెస్టిండీస్ ఙం జింబాబ్వే మధ్య జరుగుతున్న కీలక మ్యాచ్ క్రికెట్ అభిమానులను ఉత్కంఠకు గురిచేస్తోంది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైయర్ కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి స్టేడియాన్ని ఉర్రూతలూగించాడు. అతడి మెరుపు ఇన్నింగ్స్‌తో వెస్టిండీస్ స్కోర్ బోర్డు వేగంగా దూసుకెళ్తోంది. టాస్ గెలిచిన జింబాబ్వే ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, వెస్టిండీస్ బ్యాటింగ్ ప్రారంభించింది. పవర్‌ప్లేలో కొంత ఒత్తిడి ఎదురైనా, మిడిల్ ఓవర్లలో హెట్‌మైయర్ క్రీజ్‌లోకి దిగిన వెంటనే మ్యాచ్ సీన్ పూర్తిగా మారిపోయింది. స్పిన్నర్లపై దూకుడుగా, పేసర్లపై పవర్ ఫుల్ షాట్లతో అతడు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం ఈ వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ తరఫున వేగవంతమైన అర్ధశతకాలలో ఒకటిగా నిలిచింది. హెట్‌మైయర్ 5 వరుస సిక్సర్లు, 5 ఫోర్లు బాదడంతో జింబాబ్వే బౌలర్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. మరో వైపు బ్యాటింగ్ చేసిన సహచరులు కూడా స్థిరంగా నిలబడి భాగస్వామ్యాన్ని నిర్మించడంతో వెస్టిండీస్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లింది. డెత్ ఓవర్లలో మరింత దూకుడు చూపితే వెస్టిండీస్ 180ం స్కోర్ దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు జింబాబ్వే బౌలర్లు పవర్‌ప్లేలో చూపిన క్రమశిక్షణను మిడిల్ ఓవర్లలో కొనసాగించలేకపోయారు. ముఖ్యంగా హెట్‌మైయర్ వేగంగా పరుగులు చేయడంతో మ్యాచ్‌పై వెస్టిండీస్ పట్టు సాధించింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే బ్యాటింగ్ ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించనుంది.




# చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో హార్దిక్, మహికా సందడి.



టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతున్న తరుణంలో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మైదానంలో కంటే మైదానం బయటే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నాడు. హార్దిక్ పాండ్యా తన కొత్త గర్ల్‌ఫ్రెండ్, నటి మహికి శర్మతో రిలేషన్‌లో ఉన్నాడనే వార్తలు ఇప్పుడు అధికారికంగా ధ్రువీకరించబడినట్లు కనిపిస్తోంది. టోర్నీ ప్రారంభం నుంచి టీమిండియా ఎక్కడికి వెళ్తే మహికి అక్కడే ప్రత్యక్షమవుతోంది. తాజాగా భారత జట్టు తన తదుపరి మ్యాచ్ కోసం చెన్నై చేరుకోగా, ఎయిర్‌పోర్ట్‌లో హార్దిక్ తన ప్రియురాలి భుజంపై చేయి వేసి నడుస్తున్న ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో వీరిద్దరి ప్రేమాయణం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వ్యక్తిగత జీవితం సంగతి పక్కన పెడితే, హార్దిక్ పాండ్యా ఆటతీరుపై మాత్రం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన సీనియర్ ప్లేయర్, మైదానంలో మాత్రం చేతులెత్తేస్తున్నాడనే ఆగ్రహం అభిమానుల్లో కనిపిస్తోంది. గ్రూప్ స్టేజ్‌లో నమీబియా వంటి చిన్న జట్టుపై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన హార్దిక్, అసలైన సూపర్ 8 పోరులో మాత్రం విఫలమయ్యాడు. సౌతాఫ్రికాతో జరిగిన కీలక మ్యాచ్‌లో బౌలింగ్‌లో 4 ఓవర్లలో ఏకంగా 45 పరుగులు సమర్పించుకోవడమే కాకుండా, బ్యాటింగ్‌లో కూడా 17 బంతుల్లో కేవలం 18 పరుగులు మాత్రమే చేసి ఒత్తిడిలో నిలబడలేకపోయాడు. హార్దిక్ పాండ్యా తన ప్రియురాలి పుట్టినరోజు వేడుకలను కూడా అహ్మదాబాద్‌లోని టీమ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించాడు. జట్టులోని ఇతర సభ్యులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే, అభిమానుల ప్రశ్న మాత్రం ఒక్కటే.. రొమాన్స్ ఓకే.. కానీ టీమిండియాను ఎప్పుడు గెలిపిస్తావు హార్దిక్?. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన పాండ్యా, ఇప్పటివరకు పెద్ద జట్లపై తన మార్కు చూపించలేకపోయాడు. బౌలింగ్‌లో పరుగులు నియంత్రించలేకపోవడం, బ్యాటింగ్‌లో స్ట్రైక్ రేట్ మందగించడం జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తోంది.తదుపరి మ్యాచ్ జింబాబ్వేతో చెన్నైలోని చేపాక్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే మహికా శర్మ చెన్నై చేరుకోవడంతో, ఈ మ్యాచ్‌లోనైనా హార్దిక్ బ్యాట్‌తో లేదా బంతితో విన్యాసాలు చేస్తాడో లేదో చూడాలి. ఒక ప్రొఫెషనల్ క్రికెటర్‌గా తన ప్రధాన బాధ్యత దేశాన్ని గెలిపించడమేనని హార్దిక్ గుర్తించాలని మాజీ క్రికెటర్లు సైతం సూచిస్తున్నారు. మరి జింబాబ్వేపై అయినా ఈ స్టార్ ప్లేయర్ తన పాత ఫామ్ అందుకుని విమర్శకుల నోళ్లు మూయిస్తాడో లేదో వేచి చూడాలి.

# అభిషేక్ శర్మపై వేటు?

## సంజూ శాంసన్‌ను జట్టులోకి..



దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక సూపర్–8 మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన తర్వాత టీమిండియా యాజమాన్యం మేల్కొంది. ఈ ఓటమి కేవలం ఒక మ్యాచ్ పరాజయం మాత్రమే కాదు.. భారత్ సెమీఫైనల్ ఆశలను కూడా దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో జింబాబ్వే, వెస్టిండీస్‌తో జరగబోయే కీలక మ్యాచ్‌ల కోసం ప్లేయింగ్ ఎలెవన్‌లో భారీ మార్పులు చేసేందుకు గౌతమ్ గంభీర్ సేన సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మపై వేటు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కడుపు ఇన్ఫెక్షన్ నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన అభిషేక్ శర్మ.. పాకిస్థాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌ల్లో కనీసం ఖాతా తెరవలేకపోయాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక పోరులోనూ కేవలం 15 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. దీంతో అభిషేక్ స్థానంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకోవాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది.ప్రస్తుతం భారత టాపార్డర్ అంతా ఎడమచేతి వాటం బ్యాటర్లతోనే (అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ) నిండిపోయింది. ఇది ప్రత్యర్థి జట్ల స్పిన్నర్లకు వరంగా మారుతోంది. ఈ ఏకపక్ష బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చాలని కోచింగ్ స్టాఫ్ భావిస్తోంది. సహాయ కోచ్ ర్యాన్ టెన్ డోష్చేట్ మాట్లాడుతూ.. "సంజూ శాంసన్ ఓ అద్భుతమైన ఆటగాడు. అతనిని టాపార్డర్‌లో చేర్చడం వల్ల వ్యూహాత్మకంగా రైట్ హ్యాండ్ – లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ సెట్ అవుతుంది. జట్టులో మార్పుల గురించి రాబోయే రెండు రోజుల్లో చర్చిస్తాం" అని పేర్కొన్నారు. కేవలం అభిషేక్ శర్మ మాత్రమే కాదు.. తిలక్ వర్మ, రింకూ సింగ్ ప్రదర్శనలపై కూడా మేనేజ్‌మెంట్ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ ముగ్గురిలో కనీసం ఒకరిని పక్కన పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. భారీ హిట్టర్‌గా పేరున్న రింకూ సింగ్ దక్షిణాఫ్రికాపై డకౌట్ అవ్వడం టీమిండియా మిడిలార్డర్ బలహీనతను బయటపెట్టింది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లను జింబాబ్వే, వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంది. సెమీస్ చేరాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలవడమే కాకుండా, నెట్ రన్ రేట్‌ను కూడా భారీగా మెరుగుపరుచుకోవాలి. ఈ క్రమంలో గంభీర్ మార్క్ 'అగ్రెసివ్' నిర్ణయాలు ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండబోతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఒత్తిడిలో చిక్కుకుపోయిన అభిషేక్ శర్మ


## భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్



టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక సూపర్–8 మ్యాచ్‌లో కూడా అభిషేక్ శర్మ(12 బంతుల్లో 15 పరుగులు) తక్కువ స్కోరుకే వెనుదిరగడంపై భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించారు. టోర్నీకి ముందు అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ.. ప్రపంచ కప్ వంటి మెగా ఈవెంట్లో ఎందుకు తడబడుతున్నారో గవాస్కర్ విశ్లేషించారు.స్టార్ స్పోర్ట్స్‌తో సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నప్పుడు ఉండే ఒత్తిడి ఆటగాడి సహజసిద్ధమైన శైలిని ఎలా దెబ్బతీస్తుందో వివరించారు. "నెట్స్‌లో ప్రాక్టీస్ చేసేటప్పుడు ఔట్ అయినా మళ్లీ బంతిని ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. కానీ మ్యాచ్‌లో అలా కాదు, ఒక్క వికెట్ పడితే అంతా అయిపోతుంది. ఆ ఒత్తిడి కారణంగా ఆటగాడి కాళ్లు, చేతులు ఒక్కోసారి స్తంభిస్తాయి . అందుకే అభిషేక్ తన ఫ్రీడమ్‌ను కోల్పోయి ఆడుతున్నాడు" అని గవాస్కర్ అభిప్రాయపడ్డారు.దక్షిణాఫ్రికా బౌలర్లు అభిషేక్ శర్మను కట్టడి చేయడానికి పక్కా వ్యూహంతో బరిలోకి దిగారని గవాస్కర్ పేర్కొన్నారు. "అభిషేక్ సాధారణంగా రూమ్ చేసుకుని ఆఫ్ సైడ్ షాట్లు ఆడటానికి ఇష్టపడతాడు. అందుకే రబాడ వంటి బౌలర్లు అతనికి ఏమాత్రం గ్యాప్ ఇవ్వకుండా పదేపదే ప్యాడ్లను లక్ష్యంగా చేసుకుని బంతులు వేశారు. ఒక సిక్స్ కొట్టినప్పటికీ.. దక్షిణాఫ్రికా బౌలర్లు తమ ప్లాన్ మార్చుకోకుండా తెలివిగా బౌలింగ్ చేసి అతడిని ఇబ్బంది పెట్టారు" అని చెప్పుకొచ్చారు. కేవలం అభిషేక్ శర్మ మాత్రమే కాదు.. మిగిలిన భారత బ్యాటర్ల ప్రదర్శనపై కూడా సునీల్ గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఈ పిచ్‌పై బంతి బ్యాటు మీదకు అంత సులభంగా రావడం లేదు. కానీ దక్షిణాఫ్రికా బ్యాటర్లు డేవిడ్ మిల్లర్, డెవాల్డ్ బ్రెవిస్ పిచ్ పరిస్థితులను అర్థం చేసుకుని జాగ్రత్తగా ఆడారు. భారత బ్యాటర్లు మాత్రం సరైన షాట్ సెలక్షన్ లేకుండా వికెట్లు పారేసుకున్నారు" అని సునీల్ గవాస్కర్ విమర్శించారు. భారత్ ఈ మ్యాచ్‌లో 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం వల్ల సెమీఫైనల్ రేసు క్లిష్టంగా మారింది.భారత్ తన తదుపరి రెండు మ్యాచ్‌ల్లో జింబాబ్వే, వెస్టిండీస్‌లను ఓడించాల్సి ఉంటుంది. ఒకవేళ దక్షిణాఫ్రికా తన తదుపరి మ్యాచ్‌ల్లో కూడా అజేయంగా నిలిస్తే, భారత్ దక్షిణాఫ్రికా వరుసగా 4, 6 పాయింట్లతో సెమీస్‌కు చేరుకోవడానికి అవకాశం ఉంటుంది.


ప్రజావీక్షణం
దినపత్రిక

# పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు విజయ్



టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్" అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. లఅభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.





VIJAY DEVERAKONDA

OM SHREE GANESHAYA NAMAHA

Dear

Namasthe :)

I'm writing to share some special news and to invite you to be huge moment in our lives.

With the love and blessings of our families, ... getting married on 26.02.26 in a small and intimate ...

As we begin this new chapter- celebrating and creating memo... around our union- it would truly mean a lot to us to celebrate ... who have been a part of our journeys. Your presence and ble... would make this occasion even more special for us.


We warmly invite you to join us and bless us at our Wedding Reception.

Wednesday, 04 March, 2026 | 7:00 PM onwards
Taj Krishna
Banjara Hills, Hyderabad

We look forward to celebrating together.

Warm regards,
Vijay
(on behalf of Rashmika & myself)

# త్రివిక్రమ్-వెంకి కాంబోలో ఎకె 47




టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఎకె 47' విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం. ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు రైటర్ హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్-వెంకీ ఇప్పుడు డైరెక్టర్ హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.

# ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలనే ఆలోచనతోనే 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు. ఈ హుక్ లైన్ చెప్పగానే డీఎస్పీ ఉత్సాహంగా స్పందించారని తెలిపారు. మాస్ హుక్ లైన్‌లో కూడా ఫిలాసఫీ చెప్పొచ్చని దేవిశ్రీ ప్రసాద్ తనకు కాంప్లిమెంట్ ఇచ్చారని చెప్పారు. ఈ పాటను రచయిత చంద్రబోస్ కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గంటల్లో రాశారని వెల్లడించారు. ఇది కేవలం అభిమానంతో రాసిన పాట కాదు. పవన్ కళ్యాణ్ లైఫ్ స్టైల్, ఆయన జర్నీపై అవగాహనతో వచ్చిన పాట. ఆయన వ్యక్తిత్వం, కష్టపడే స్వభావం ఈ పాటలో ప్రతి లైన్‌లో కనిపిస్తుంది. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయనకు విజయాలు రాత్రికి రాత్రే రాలేదు. ఆ ప్రయాణం మొత్తం ఈ పాటలో వినిపిస్తుంది' అని హరీష్ శంకర్ అన్నారు.

# అల్లువారింట పెళ్లి సందడి


## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం





అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చాక ఫిబ్రవరి 20న అల్లు అర్జున్ హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు, టాలీవుడ్ నటీనటులకు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో రామ్ చరణ్ దంపతులతో పాటు శ్రీలీల, మృణాల్, ఫరియా అబ్దుల్లా మరికొందరు సందడి చేశారు.

# ది ప్యారడైజ్ నుంచి ప్రోమో సాంగ్ విడుదల




నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# ఓజి దర్శకుడితో నాని బ్లడీ రోమియో

ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని ఓ స్టైలిష్ యాక్షన్ డ్రామాకు శ్రీకారం చుట్టాడు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీ, సుజీత్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగమని సమాచారం. ఈ కాంబినేషన్ ప్రకటించగానే అభిమానుల్లో భారీ ఎ÷-జగైట్మెంట్ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా బాలీవుడ్ సెన్సేషన్ తృప్తి డిమ్రీ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆమె సందీప్ రెడ్డి వంగా- ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్‌లో నటిస్తోంది. ఒకవేళ 'బ్లడీ రోమియో'లో కూడా ఆమె ఓకే అయితే, ఇది ఆమెకు రెండో తెలుగు సినిమా అవుతుంది. 'యానిమల్ ' చిత్రంతో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి, నాని సరసన నటిస్తే ఆ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం అంటున్నారు సినీ విశ్లేషకులు. ఒకవైపు రా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్, మరోవైపు స్టైలిష్ యాక్షన్ డ్రామా ఇలా రెండు విభిన్న జానర్లలో నాని తన నటనా పరిధిని విస్తరించుకుంటున్నాడు. కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చే హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఈ రెండు సినిమాలతో మరోసారి తన రేంజ్‌ను నిరూపించు కునేందుకు సిద్ధమవుతున్నాడు. మొత్తానికి 'ది ప్యారడైజ్' మరియు 'బ్లడీ రోమియో' ప్రాజెక్ట్‌లు నాని కెరీర్‌లో కీలక మైలురాళ్లుగా నిలవనున్నాయా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అధికారిక ప్రకటనలు వెలువడే వరకు ఈ క్రేజీ కాంబినేషన్‌లపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి.



# శ్రీలీలని పలకరిస్తున్న వరుస ఫ్లాపులు..

## అయిన కూడా ఏకంగా స్టార్ హీరో సరసన ఛాన్స్?

సౌత్ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్లలో అచ్చ తెలుగమ్మాయిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించింది. రవితేజతో చేసిన ధమాకా ద్వారా తెలుగులో తొలి భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, హిట్లుఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా మారింది. తన టాలెంట్‌తో నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తూ కమర్షియల్ సినిమాల్లో ప్రత్యేక ఇమేజ్‌ను నిర్మించుకుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించిన శ్రీలీల, మాస్ ఎంటర్‌టైనర్ల నుంచి లవ్ స్టోరీల వరకు విభిన్న కథలను ఎంచుకుంటూ కెరీర్‌ను విస్తరించుకుంటోంది. ఇదే సమయంలో కోలీవుడ్‌పైనా దృష్టి సారించింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడ కూడా అవకాశాలు అందుకుంటోంది. ఇక తాజాగా ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఐ55' (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వండ్ బార్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో సాయి పల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరచు కోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళ స్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని టాక్ నడుస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తో మరోసారి చేతులు కలపబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని చెబుతున్నారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com